


# విజయభాను


44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 04-12-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 73 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## తలైవా వచ్చేస్తున్నాడు

- తమిళ ప్రజల కోసం ప్రాణమైనా ఇస్తా
- జనవరిలో రజనీకాంత్ కొత్త పార్టీ



చెన్నై : తమిళనాడు కోసం జీవితాన్ని త్యాగం చేస్తానని, రాష్ట్ర ప్రజల కోసం తన ప్రాణాలు ఇవ్వడానికైనా సంతోషపడతానని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. రాజకీయాల్లోకి వస్తున్నానంటూ అధికారికంగా ప్రకటించిన అనంతరం తలైవా తొలిసారిగా మీడియాతో మాట్లాడారు. తన రాజకీయ ప్రవేశాన్ని కొందరు విమర్శిస్తూనే ఉన్నారని రజనీ ఈ సందర్భంగా తెలిపారు. వైద్యులు వద్దంటున్నా.. ప్రజలు, అభిమానుల కోసం రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

రాజకీయ అరంగేట్రం కోసం రాష్ట్రంలో పర్యటించాలనుకున్నా కొవిడ్ వల్ల అది సాధ్యపడలేదన్నారు. తమిళ ప్రజల తలరాతలు మార్చాల్సిన సమయం ఆసన్నమైందని, వచ్చే ఎన్నికల్లో పోటీకి సమాయత్తం కావాలని రజనీ పిలుపునిచ్చారు. 'ఇచ్చిన హామీలపై ఎప్పుడూ వెనక్కివెళ్లను. ప్రస్తుతం రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. మార్పు ఇప్పుడు జరగకపోతే ఇంకెప్పటికీ జరగదు. ఇందుకోసం ప్రజలు నా వెంట ఉంటే.. మనమంతా కలిసి మార్పును తీసుకొద్దాం' అని రజనీ అన్నారు. ప్రజల ఆదరణతో కష్టపడి పనిచేసి రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తానని తలైవా ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ అరంగేట్రంపై సుదీర్ఘ సందిగ్ధతకు తెరదించుతూ రజనీ ఈ రోజు కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది జనవరిలో పార్టీని ప్రారంభిస్తానని, అందుకు సంబంధించిన వివరాలను డిసెంబరు 31న వెల్లడిస్తానని ట్విటర్ వేదికగా ప్రకటించారు. "త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఆదరణతో గెలిచి

తరువాయి 2లో..

ఉత్తర శ్రీలంకపై

## 'బురేవీ' ప్రభావం



విశాఖపట్నం: దక్షిణ తమిళనాడు, దక్షిణ కేరళ తీరాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర శ్రీలంకపై గత ఆరు గంటలలో 11 కి.మీ వేగంతో పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి లాట్ సమీపంలోని మన్నార్ గల్ఫ్ వద్ద బురేవీ తుపాను కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

మన్నార్‌కు పశ్చిమ-వాయువ్య దిశలో 30 కి.మీ, పంబన్‌కు తూర్పు-ఆగ్నేయంలో 40 కి.మీ, కన్యాకుమారికి తూర్పు-ఈశాన్యంగా 260 కి.మీ. దూరంలో

తరువాయి 2లో..

## నకిలీ కోవిడ్ వ్యాక్సిన్స్ అమ్ముతారు..

### జాగ్రత్త




న్యూఢిల్లీ : వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వాళ్లు నకిలీ కొవిడ్ వ్యాక్సిన్స్‌ను అమ్ముతారు జాగ్రత్త అంటూ ఇంటర్ పోల్ హెచ్చరించింది. ఈ మేరకు 194 దేశాల్లోని అన్ని పోలీసు వ్యవస్థలకు ఆరెంజ్ నోటీస్ జారీ చేసింది. ప్రపంచంలోనే తొలిసారిగా ఫైజర్ వ్యాక్సిన్‌కు యూకే అనుమతించిన రోజే ఇంటర్‌పోల్ ఈ వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. కొవిడ్ వ్యాక్సిన్‌లకు సంబంధించి జరిగే నకిలీలు, చోరీలు, అక్రమ వ్యాపారాలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించింది. నకిలీ వ్యాక్సిన్‌లను అడ్వర్‌టైజ్ చేయడం, అమ్మడం చేస్తున్న

తరువాయి 2లో..

## రాజకీయం చేసేందుకేనా అసెంబ్లీ ?

- పేదల సంక్షేమంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు
- ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు బలహీనవర్గాలు గుర్తొస్తాయి
- హైకోర్టు చెప్పినా 2018లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదు
- అసెంబ్లీ సమావేశాల్లో సీఎం వైఎస్ జగన్



అమరావతి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమంపై చర్చకు ప్రతిపక్షం నుంచి సలహాలు వస్తాయని చూశామని, ప్రతిపక్షం మాత్రం రాజకీయం చేసేందుకే అసెంబ్లీని ఉపయోగించుకుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నాలుగో రోజు సంక్షేమ బిల్లులపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ సభ్యుల తీరుపై నిప్పులు చెరిగారు. సభ సజావుగా జరగకుండా అడ్డుకుని సస్పెన్షన్ కోరుకున్నారని.. చంద్రబాబుకు పేదల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రూ.79,806 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని దుయ్యబట్టారు. "ఏడాదికి రూ.15,419 కోట్లు మాత్రమే సంక్షేమానికి ఖర్చు చేశారు. మేం అధికారంలోకి వచ్చాక కేవలం 18 నెలల్లో రూ.58,729 కోట్లు ఖర్చు చేశాం. ఏడాదికి రూ.39,153 కోట్లు సంక్షేమానికి కేటాయించాం. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు బలహీనవర్గాలు గుర్తొస్తాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబు బీసీ సబ్‌ప్లాన్, బీసీ కార్పొరేషన్లు అన్నారు. 2 నెలల్లో ఎన్నికలొస్తాయనగా పెన్షన్‌ను రూ.1000 నుంచి రూ.2వేలకు పెంచారు. 2018లో హైకోర్టు చెప్పినా చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికలు

తరువాయి 2లో..

## 8న రెండు వేల మంది మహిళలతో బైక్ ర్యాలీ

### ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



విజయవాడ: విశాఖ ఘటన అమానుషమని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రేమ పేరుతో దాడులు చేయడం సమంజసం కాదన్నారు. బాధితులకు మహిళా కమిషన్ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడానని, వారికి అండగా ఉంటామని హామీ ఇస్తున్నామన్నారు. మహిళా మార్చ్‌లో భాగంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ఆమె చెప్పారు. రానున్న వంద రోజుల్లో ఇరవై అంశాలపైన మహిళా కమిషన్ సమావేశాలు జరగనున్నాయని వెల్లడించారు. వంద రోజుల్లో జిల్లా, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు

తరువాయి 2లో..

## '40 ఇయర్స్ విత్ అబ్దుల్ కలాం- అన్‌టోల్డ్ స్టోరీస్' పుస్తకావిష్కరణ




ఢిల్లీ : డాక్టర్ శివతాను పిళ్లై రచించిన 40 ఇయర్స్ విత్ అబ్దుల్ కలాం- అన్‌టోల్డ్ స్టోరీస్ పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గురువారం విడుదల చేశారు. వర్చువల్ సమావేశం ద్వారా ఉప రాష్ట్రపతి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. దేశ యువత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం నుండి ప్రేరణ పొందాలన్నారు. బలమైన, స్వావలంబన, సమగ్ర భారత దేశాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేద్దామన్నారు. గ్రామాలు, చిన్న పట్టణాల్లో ఉపాధి, ఆర్థిక అవకాశాలను సృష్టించాల్సిన అవసరాన్ని ఉపరాష్ట్రపతి నొక్కి చెప్పారు. వివిధ ఆర్థిక, సామాజిక సవాళ్లకు పరిష్కారాలను అందించేందుకు యువత ఆలోచించాలన్నారు. డాక్టర్ కలాం నిజమైన కర్మ యోగి అన్నారు. ప్రతి భారతీయుడికి ప్రేరణ అన్నారు. డాక్టర్ కలాం సలహాను అనుసరించి, స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన అభివృద్ధి మార్గాన్ని అవలంబించాల్సిన సమయం ఇదే అన్నారు.

మసాలా సామ్రాజ్యాధినేత

## మహాశయ్ ఇకలేరు



(ఫైల్ ఫోటో)



దిల్లీ: ప్రముఖ మసాలా ఉత్పత్తుల సంస్థ ఎండీహెచ్ అధినేత, పద్మభూషణ్ గ్రహీత మహాశయ్ ధర్మపాల్ గులాటీ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో దిల్లీలోని ఆసుపత్రిలో చేరిన ఆయన.. గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 97 సంవత్సరాలు. 1923లో పాకిస్థాన్‌లోని సియల్‌కోట్‌లో జన్మించిన గులాటీ నాలుగో తరగతితోనే చదువు మానేశారు. ఉపాధి కోసం ఒకప్పుడు దిల్లీ రోడ్లపై గుర్రపు బండి నడిపిన ఆయన.. మసాలా సంస్థను స్థాపించి అంచెలంచెలుగా ఎదిగారు. తొలుత చిన్న బడ్డీకొట్టుతో మొదలైన ఆయన వ్యాపారం అనతి కాలంలోనే దిగ్గజ పరిశ్రమ స్థాయికి చేరుకుంది. దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందింది. ఏడాదికి 900 కోట్ల రూపాయల టర్నోవర్‌తో విదేశాల్లోనూ ఆఫీసులు నిర్వహించే స్థాయికి చేరింది. అమెరికా, కెనడా, ఇంగ్లడ్, జపాన్, యూఏఈ, సౌదీఅరేబియా లాంటి ఎన్నో దేశాలకు ఎండీహెచ్ మసాలా ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఎండీహెచ్ 62 రకాల మసాలాలను ఉత్పత్తి చేస్తోంది.

వ్యాపార రంగంలోనే కాదు.. దానధర్మాల్లోనే గులాటీ ఎప్పుడూ ముందుంటారు. సమాజానికి ఎంతో కొంత తిరిగివ్వాలనే ఆలోచనతో మహాశయ్ చున్నీలాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. తన జీతంలో 90శాతానికి పైగా ఈ సంస్థ నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకే వెళ్తోందంటే ఆయన ఉదారత అర్థం చేసుకోవచ్చు. ఆయన సేవలకు గుర్తింపుగా 2019లో కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. తన జీవితంలో ఎన్నో విజయాలు సాధించినప్పటికీ 'పద్మభూషణ్' అందుకున్న ఆ క్షణాలు ఎప్పటికీ మర్చిపోలేనని గులాటీ అంటుండేవారు. గులాటీ మృతికి పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. 'భారత అత్యుత్తమ వ్యాపారవేత్తల్లో ఒకరైన మహాశయ్ ధర్మపాల్ గులాటీ మరణం బాధాకరం. చిన్న వ్యాపారంతో జీవితాన్ని మొదలుపెట్టిన ఆయన తనకంటూ గొప్ప గుర్తింపు తెచ్చుకున్నారు. సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. చివరిక్షణం వరకు సేవ చేస్తూనే గడిపారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' అని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా తదితరులు కూడా సంతాపం తెలిపారు.

తుపాను బాధిత రైతులను

## ఏపీ ప్రభుత్వం ఆదుకోవాలి

**- జనసేన అధినేత పవన్‌కల్యాణ్**



తిరుపతి: నివర్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఏపీ ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. వ్యవసాయం లాభసాటి కావాలనేదే జనసేన ఆలోచన అని చెప్పారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35వేల పరిహారం చెల్లించాలని పవన్ డిమాండ్ చేశారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిహారం ఆలస్యం చేయడం మూలంగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. ఇప్పటికే నలుగురు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్టంపై అన్ని ప్రాంతాల్లో తమ పార్టీ నేతలు ప్రత్యక్షంగా పర్యటించి నివేదిక తయారు చేస్తామని.. దాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అందిస్తామని వివరించారు. ఎప్పుడూ పంటనష్ట పరిహారం రైతులకు కొద్దోగొప్పో అందుతోందని.. కౌలు రైతులకు మాత్రం సంపూర్ణసాయం అందడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే కౌలురైతుల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు.

రైతుల కోసం త్వరలోనే 'జైకిసాన్' కార్యక్రమానికి శ్రీకారం చుడతామని పవన్ చెప్పారు. ఎకరాకు రూ.5వేలు, రూ.10వేలు ఇస్తే న్యాయం జరగదన్నారు. అధికంగా పింఛన్లు ఇచ్చేందుకు నిధులు ఉన్నప్పుడు రైతులకు రూ.35వేలు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కేంద్రం తీసుకొచ్చిన కిసాన్ బిల్లులో అభ్యంతరాలుంటే చెప్పాలని ప్రభుత్వం కోరుతోందన్నారు. ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ రాజకీయరంగ ప్రవేశంపై మీడియా ప్రతినిధులు పవన్ స్పందన కోరగా.. భారీగా అభిమాన బలం, బలమైన ఆలోచన ఉన్నవాళ్లు రాజకీయాల్లోకి వస్తే మంచి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రజనీ ప్రత్యక్షంగా

తరువాయి 2లో..




# వైయస్ జగన్ చూసిన కన్నీటి గాథల నుంచి సంక్షేమ పథకాలు

- ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎం వైయస్ జగన్ పాలన సాగుతోంది
- పేదల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు
- పత్రికల ద్వారా ఎదిగిన నాయకుడికి ప్రజల కష్టాలు తెలియవు
- వైయస్ జగన్‌ది తన తండ్రి నుంచి సంక్రమించిన వారసత్వమైన ప్రజా నాయకత్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు



అమరావతి : వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన 3648 కిలోమీటర్ల పాదయాత్రలో చూసిన కన్నీటి గాథల నుంచి వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వచ్చాయని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎం వైయస్ జగన్ రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును ప్రజలకు వివరించేందుకు చేపట్టిన స్వల్పకాల చర్చలో మాట్లాడారు. ప్రజలిచ్చిన అధికారం ఏ దిశ వైపు వెళ్తుంది.. ఏ లక్ష్యాలను చేరుకోవాలని ప్రయత్నం చేస్తుంది. అది రాజ్యాంగ బద్ధమా? మన స్థితిగతులు మారబోతున్నాయా అన్నది ఆలోచన చేయాలి. మన ప్రభుత్వాలు ఎవరు పనిచేసినా రాజ్యాంగ పరిధిలోనే పని చేయాల్సి ఉంటుంది. రాజ్యాంగంలో ఉన్న రెండు ప్రధానమైన విషయాల గురించి మాట్లాడినప్పుడు..పౌరులు తమ హక్కులకు భంగం కలిగినప్పుడు కోర్టుకు వెళ్తారు. రెండోది ఆదేశ సూత్రాలు పాటించని ప్రభుత్వాలు ఉన్నప్పుడు పౌరులు కోర్టుకు వెళ్లే పరిస్థితి పెద్దగా లేదు. ప్రభుత్వాలు రాజ్యాంగ సూత్రాలు పాటించాల్సిందే తప్ప..ప్రశ్నించేవి తక్కువే. ఫైనల్‌గా ఎన్నికలు తీర్పుఇస్తాయి. మన సమాజం ప్రపంచంలోనే భిన్నంగా ఉంది. ఇక్కడ అనేక కులాలు, మతాలు, వర్గాలు, వ్యత్యాసాలు కలిగిన ప్రజలు ఉన్నారు. ఇలాంటి వి రాష్ట్రంలోనూ ఉన్నాయి. దీన్ని గుర్తు పెట్టుకొని పాలన చేయాల్సి ఉంటుంది.దీన్ని గుర్తు చేస్తూ ఆదేశ సూత్రాలు ఉన్నాయి. ఈ సూత్రాలు పాటిస్తే..వందకు వంద శాతం రాజ్యాంగాన్ని పాటించినట్లే. సమాజంలో ఉన్న వ్యత్యాలు తగ్గించకపోతే అడవిలో ఉన్న వ్యక్తి ఎలా బయటకు వస్తాడు. సమసమాజ స్థాపన ఎలా జరుగుతుంది. ఇలాంటి వర్గాలను గుర్తించడం ఒక విషయం అయితే..వారికి ప్రభుత్వం అందించాల్సిన సాయాన్ని సక్రమంగా అందించాలి. ఇది ఒక పెద్ద సవాలు. అందించాల్సిన పథకాలు సక్రమంగా అందించని పరిస్థితి గతంలో చూశాం. చట్ట సభలో కేటాయించిన నిధులు 50 శాతం కూడా అందించలేకపోయారు. ఇలాంటి నేపథ్యంలో ఈ రాష్ట్రంలో ఏర్పడిన వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, వైయస్ జగన్ ప్రభుత్వం చేసిన ప్రయత్నం చాలా గొప్పది. ప్రశంసించాల్సిన అవసరం ఉంది. చాలా మంది తెలిసీ తెలియక మాట్లాడుతున్నారు. రాష్ట్రం దివాళ తీస్తుందని అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. పేదల ఆకలి, కన్నీరుపై వారికి స్పృహ ఉండదు. ఎవరు రక్తాన్ని చిందిస్తే పైకి వచ్చామోమరిచి ఆరోపణలు చేస్తున్నారు. ఒక నాయకుడు దీనికి భయపడకూడదు. నాయకుడికి ఏ వర్గాలు ఉన్నాయి. ఏం కోరుకుంటున్నారన్నది తెలియాలి. అందుకే వైయస్ జగన్ తాను చేసిన పాదయాత్ర, తాను చూసిన కన్నీటి గాథలు, హెచ్చుతగ్గులు కలిగిన ప్రమాణాలు అన్ని కూడా ఈ పరిపాలన వెనుక ఉన్నాయని సందేహం లేకుండా చెప్పగలను. కొంత మంది నాయకులు పత్రికలతో, మీడియాతో ఎదిగిన వారు ఉంటారు. వారికి ప్రజల కష్టాలు అర్థం కావు. ఎండా వానా, గాలి, వానా, అంటురోగాలు ఇలాంటి పరిస్థితుల మధ్య వైయస్ .జగన్ పాదయాత్ర కొనసాగించారు.

తనకు అధికారం వచ్చినప్పుడు ఇలాంటి కష్టాలు తీర్చగలరు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. ఇప్పటికీ కొన్ని వర్గాల గురించి, వృత్తుల గురించి తెలియదు. ఆ స్పృహ కలిగిన వాడిని తాను. ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పులు చేసిన నాయకుడు సక్సెస్ అవుతాడు. వైయస్ జగన్ తన తండ్రి నుంచి సంక్రమించిన వారసత్వమైన ప్రజా నాయకత్వమని నా విశ్వాసం. వైయస్ రాజశేఖరరెడ్డి కూడా ప్రజల నుంచి వచ్చిన నాయకుడు. కొంత మంది జీవనప్రమాణాలు మార్చారు. కొంత మందిలో గొప్ప మార్పులు తెచ్చారు.

అదే ఒరవడిలో ఈనాటి ప్రభుత్వం కూడా అడుగులు వేస్తోంది. అందులో నుంచి వచ్చిందే నగదు బదిలీ పథకం. అంబేద్కర్ మన రాజ్యాంగం గురించి చెబుతూ..ఒక మంచి రాజ్యాంగాన్ని కలిగి ఉండవచ్చు..కానీ వాటిని అమలు చేయని వ్యక్తులు లేకపోతే చెడ్డ రాజ్యాంగంగా మారుతుంది. చెత్త రాజ్యాంగమైన సరే..విశాల ధృక్పథం కలిగిన నాయకుడు వాటిని సక్రమంగా అమలు చేస్తే అది గొప్ప పరిపాలన కింద, గొప్ప రాజ్యాంగంగా చెప్పవచ్చు అని అంబేద్కర్ చెప్పినట్లు ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు వివరించారు.

## ఆర్థిక అక్షరాస్యత చైతన్యరథాన్ని ప్రారంభించిన జేసీ




శ్రీకాకుళం : కరోనా నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలపై ప్రజలను చైతన్యవంతులను చేసే ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథాన్ని సంయుక్త కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు గురువారం ఉదయం యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ప్రారంభించారు. నాబార్డ్ సౌజన్యంతో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జె.సి ముఖ్యఅతిథిగా పాల్గొని వాహనానికి పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభించి, డిజిటల్ అవగాహన కార్యక్రమాన్ని వీక్షించారు.

ఈ సందర్భంగా జె.సి మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలు చేసుకునేవారు సురక్షిత బ్యాంకింగ్ పద్ధతిని అవలంభించాలన్నారు. దుకాణాల వద్ద ఏటిఎం కార్డులను ఉపయోగించుకోవాలని, మైక్రో ఏటిఎంలతో నగదు లావాదేవీలను నిర్వహించుకోవాలని సూచించారు. ఏటిఎం మెషీన్లను వినియోగించే ముందు తదుపరి చేతులను శానిటైజర్ తో శుభ్రపరుచుకోవాలని సూచించారు.

అలాగే మాస్కు ధరించడం, సామాజిక దూరం పాటించడం, శానిటైజేషన్ చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేసారు. కరోనా లక్షణాలు దగ్గు, జలుబు, ఇతర సమస్యలతో బాధపడే వారు బ్యాంకులకు వెళ్లరాదని, డిజిటల్ లావాదేవీలను జరపడం ద్వారా కరోనా రాకుండా జాగ్రత్తలు పడవచ్చని ఆయన వివరించారు. ఈ చైతన్యరథం డిజిటల్ లావాదేవీలపై శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని జన సమూహం ఉండే ప్రాంతాల వద్ద కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని జె.సి తెలిపారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ మరియు డిజిఎం పి.కృష్ణయ్య, ఏ.జి.ఎం జి.జయజీవన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.వి.బి.డి.హరిప్రసాద్, సహాయ లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ, ఆర్థిక అక్షరాస్యత సమన్వయకర్త కె.గిరిజాశంకర్, చీఫ్ మేనేజర్లు ఆంజనేయులు, మహేంద్ర, సింహాచలం, బ్యాంకు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక కుటుంబానికి నేనున్నానంటూ ధైర్యాన్ని ఇచ్చినా గరికిన గౌరీ



విశాఖపట్నం : వార్డ్ వాలంటీర్ గా పనిచేస్తున్న ప్రియాంక అనే యువతి పై కత్తితో దాడి విశాఖ దక్షిణ నియోజకవర్గం 39 వ వార్డు లో వార్డ్ వాలెంటర్లు గా పనిచేస్తున్న ప్రియాంక అనే యువతిపై శ్రీకాంత్ అనే యువకుడు కత్తితో దాడి చేసిన సంఘటన స్థానికులను కలచివేసింది, కె.సి.హెచ్. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రియాంక మరియు వారి కుటుంబ సభ్యులకు విశాఖ సిటీ మహిళా ప్రెసిడెంట్ గరికిన గౌరి నేనున్నానని ధైర్యం చెప్పి వారందరికీ కొండంత భరోసా ఇచ్చారు, అక్కడ డాక్టర్లతో మాట్లాడి ప్రియాంక ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మంచి చికిత్స అందించాలని డాక్టర్లని గౌరి కోరారు. ఈ దారుణానికి ఒడిగట్టిన వారందరికీ శ్రీకాంత్ అనే యువకుడికి సహకరించిన వాళ్లకి కూడా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో సౌత్ మహిళా ఇంచార్జి నీలపు లక్ష్మి . కార్పొరేటర్ అభ్యర్థి కొల్లు సింహాచలం, వార్డు మహిళా ప్రెసిడెంట్ kaki పద్మ... చిన్నమ్మలు... అనురాధ... రామలక్ష్మి.... నాగమణి తదితరులు ఉన్నారు.

## నాడు నేడు పై సమీక్ష



భీమునిపట్నం : నాడు నేడు పనుల పై భీమిలి ఆనందపురం పద్మనాభం మండలాల ప్రదానోపాధ్యా యులకు శుక్రవారం భీమిలి సెయింట్ ఆన్స్ పాటశాల లో సమగ్ర శిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మల్లి ఖార్జున రెడ్డి తగు సూచనలు చేశారు. సమావేశం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మికంగా తల పెట్టిన నాడు నేడు కార్యక్రమాన్ని ఈ నెలాఖరు లోగా అందరూ పూర్తి చేయాలని కోరారు నిర్మాణ పనులు పై ఎటువంటి అశ్రద్ద వహించినా జాప్యం వహించినా ప్రదానోపాధ్యాయులు బాధ్యత వహించ వలసి వస్తుందనీ హెచ్చరించారు.

ప్రదానోపాధ్యాయులను డివిజన్ వారీగా సమీక్షించి మండల విద్యా టశాఖాధికారుల ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎం ఐ ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్ ఎంఇఓ కెవి బాలామణి, పిడి ఎం.రవీంద్ర బాబు, ఎస్ఎస్ఎ, ఎఈ లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంత్రి కొడాలి నాని నివాసంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



గుడివాడ : ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వర రావు(నాని) నివాసంలో గురువారం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. మచిలీపట్నం నుండి వచ్చిన యాంటీ బాంబ్ స్క్వాడ్ సిబ్బంది స్నిప్పర్ డాగ్ సాయంతో ఇంటి ఆవరణ, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

మంత్రి కొడాలి నాని ప్రయాణించే వాహనాన్ని కూడా తనిఖీ చేశారు. ఇటీవల రాష్ట్ర రవాణా, సమాచారశాఖ మంత్రి పేర్ని వెంకట్రామ య్య(నాని)పై జరిగిన హత్యాయత్నం నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. మంత్రి కొడాలి నాని నివాసంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. రాష్ట్ర నలుమూలల నుండి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి కొడాలి నాని నివాసానికి వచ్చే వారిని మెటల్ డిటెక్టర్, స్కానర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆ తర్వాతే మంత్రి కొడాలి నానిని కలిసేందుకు అనుమతిస్తున్నారు. ఇదిలా ఉండగా మంత్రి కొడాలి నాని ఎప్పటిలాగే ప్రజలను కలిసి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ వస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# తలైవా వచ్చేస్తున్నాడు

రాష్ట్రంలో నిజాయతీ, న్యాయమైన, కులమతాలకు అతీతమైన ఆధ్యాత్మిక రాజకీయాలకు నాంది పలకడం నిశ్చయం. అద్భుతాలు జరుగుతాయి. మారుస్తాం.. అన్నింటినీ మారుస్తాం' అని రజనీకాంత్ ట్వీట్ చేశారు. రజనీ రాజకీయ ప్రకటనపై ఆయన కుమార్తె సౌందర్య సోషల్‌మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. 'మారుస్తాం.. అన్నింటినీ మారుస్తాం.. ఇప్పుడు జరగకపోతే ఇంకెప్పటికీ జరగదు' అంటూ తండ్రి ఫొటోను షేర్ చేశారు.

## తుపాను బాధిత రైతులను ఏపీ ప్రభుత్వం ఆదుకోవాలి

ఎప్పుడూ రాజకీయాల్లోకి రానప్పటికీ పరోక్షంగా ఆయన ప్రభావం ఉండేదని పవన్ చెప్పారు. తిరుపతి ఉపఎన్నికకు జనసేన, భాజపా ఉమ్మడి కమిటీ అభ్యర్థిని ఎంపిక చేస్తుందన్నారు. ఈ విషయంలో ఎలా ముందుకెళ్తే బావుంటుందనేదానిపై చర్చించి నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు.

## ఉత్తర శ్రీలంకపై 'బురేవీ' ప్రభావం

ఉందని తెలిపింది.

దక్షిణ తమిళనాడు తీరం పంబన్, కన్యాకుమారి మధ్య నేడు రాత్రి, రేపు తెల్లవారు జామున సైక్లోనిక్ తుపానుగా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. ఈ సమయంలో 70-80 కి.మీ వేగంతో బలంగా గాలులు వీచే అవకాశం ఉందని, దక్షిణ తమిళనాడు తీరప్రాంత జిల్లాలతో పాటు రామనాథపురం, కన్యాకుమారి జిల్లాలపై ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది.

## నకిలీ కోవిడ్ వ్యాక్సిన్స్ అమ్ముతారు..

నేరాలకు సంబంధించిన సంఘటనలను కూడా ఇంటర్‌పోల్ వివరించింది. ప్రజా భద్రతకు ముప్పు వాటిల్లజేసే ఏదైనా ఘటన, ప్రక్రియ జరిగే సమయంలో ఇంటర్‌పోల్ ఇలా ఆరెంజ్ నోటీసు జారీ చేస్తుంది. ఇండియాలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ).. ఇంటర్‌పోల్‌తో కలిసి పని చేస్తుంది. వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం సురక్షితంగా జరగాలని అన్ని దేశాల పోలీసు వ్యవస్థలను ఇంటర్‌పోల్ కోరింది. ఇందులో భాగంగా నకిలీ వ్యాక్సిన్‌లను విక్రయించే అక్రమ వెబ్‌సైట్లను గుర్తించడం అత్యవసరమని సూచించింది. నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను తమవైపు తిప్పుకోవడానికి నేరగాళ్లు ప్రయత్నించే ప్రమాదం ఉన్నదని, ఇది వారి ఆరోగ్యం, ప్రాణాలకు ముప్పు తెస్తుందని ఇంటర్‌పోల్ ప్రధాన కార్యదర్శి జుర్గెన్ స్టాక్ హెచ్చరించారు. ఇలా నకిలీ వ్యాక్సిన్‌లను అమ్మడానికి ప్రయత్నిస్తున్న 3 వేల నకిలీ వెబ్‌సైట్లను ఇంటర్‌పోల్ ఇప్పటికే గుర్తించింది.

## 8న రెండు వేల మంది మహిళలతో బైక్ ర్యాలీ

'దిశ' సెక్షన్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నామని పేర్కొన్నారు. ఈ నెల 8న విజయవాడలో రెండు వేల మంది మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దిశ బిల్లును అమలులోకి తీసుకువచ్చి.. పది రోజుల్లోనే శిక్ష పడే విధంగా చర్యలు చేపడతామని వాసిరెడ్డి పద్మ వెల్లడించారు.

## రాజకీయం చేసేందుకేనా అసెంబ్లీ?

నిర్వహించలేదు. స్థానిక ఎన్నికలు నిర్వహించి ఉంటే బీసీలకు 34 శాతం రిజర్వేషన్ వచ్చేది. 59.85 శాతం రిజర్వేషన్లతో 2019లో ఎన్నికలకు వెళ్లాం. చంద్రబాబు టీడీపీకి చెందిన ప్రతాప్‌రెడ్డితో రిజర్వేషన్లపై కేసు వేయించారు. టీడీపీ వేసిన కేసుల వల్ల 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాల్సి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చంద్రబాబు రూ.3వేల కోట్లు బకాయిలు పెట్టారు. మేం అధికారంలోకి వచ్చాక బకాయిలు చెల్లించడంతో పాటు మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నాం. నేరుగా తల్లుల అకౌంట్‌కే డబ్బు జమ చేస్తున్నామని'' సీఎం తెలిపారు.(చదవండి: నేను బ్రతికున్నంత వరకు జగనే సీఎం: రాపాక)

చంద్రబాబు కావాలనే నిర్వీర్యం చేశారు..

2016 నుంచి డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం నిలిపేశారని, దీంతో మహిళలపై రూ.3,036 కోట్ల భారం పడిందని సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. మేం అధికారంలోకి వచ్చాక 2019-20 సున్నా వడ్డీ కింద రూ.1,400 కోట్లు ఇచ్చామని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద తల్లులకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు.దీని కోసం ఏడాదికి రూ.1900 కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పరిస్థితి లేదని, ప్రభుత్వ పాఠశాలలను చంద్రబాబు కావాలనే నిర్వీర్యం చేశారని ఆయన ధ్వజమెత్తారు.

కనీసం పుస్తకాలు కూడా ఇవ్వలేదు...

''ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కనీసం పుస్తకాలు కూడా ఇవ్వలేదు. ప్రైవేట్ స్కూళ్ల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం కూడా పెట్టలేదు. నాడు-నేడు ద్వారా 45వేల పాఠశాలలను రూ.10వేల కోట్లతో పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలతో పాటు మంచి మెనూతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందేలా సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చాం. 42.33లక్షల మందికి అమ్మఒడి పథకం కింద రూ.6,349 కోట్లు ఇచ్చాం. వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం ద్వారా నేరుగా మహిళల ఖాతాలకే నగదు జమ చేస్తున్నాం. దళారులు లేకుండానే సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామని'' సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

వైఎస్సార్ పెన్షన్ కింద రూ.23వేల కోట్లు..

''62లక్షల మందికి వైఎస్సార్ పెన్షన్ కింద రూ.23వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. 50.60లక్షల మందికి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.11,324 కోట్లు అందిస్తున్నాం. 18.52లక్షల మందికి విద్యాదీవెన కింద రూ.3,857 కోట్లు అందిస్తున్నాం. 2.74లక్షల మందికి వైఎస్సార్ వాహనమిత్ర కింద రూ.513 కోట్లు అందించాం. 81,703 మందికి వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద రూ.383 కోట్లు, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు 16,725 యూనిట్లకు రూ.904 కోట్లు అందించాం.14.58లక్షల మంది రైతులకు సున్నా వడ్డీ కింద రూ.1,073 కోట్ల రుణాలు ఇచ్చాం. 5.65 కోట్ల మందికి రూ.77,731 కోట్ల సంక్షేమ పథకాలు అందించాం.

బలహీనవర్గాలకు నాలుగు డిప్యూటీ సీఎం పదవులు..

మంత్రి పదవుల్లో 60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయించాం. నాలుగు డిప్యూటీ సీఎం పదవులు బలహీనవర్గాలకే కేటాయించాం. నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాం. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నాం. నామినేటెడ్ పదవులు, పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాం. దశలవారీ మద్య నిషేధంలో భాగంగా 43వేల బెల్ట్‌షాపులు రద్దు చేశాం. 33శాతం మద్యం దుకాణాలను తగ్గించాం. రాత్రి 8 గంటలకే మద్యం షాపులు మూసివేసేలా చర్యలు తీసుకున్నామని'' సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# ఏపీ సర్కారుకు ఎదురుదెబ్బ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణపై స్టే ఇవ్వాలన్న ప్రభుత్వ విజ్ఞప్తిని తోసిపుచ్చిన హైకోర్టు.. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేయాలని ఏపీ పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇవాళ హైకోర్టులో విచారణ జరిగింది. కరోనా అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికలపై పునరాలో చించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. గత మార్చి 18న సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు, రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయానికి విరుద్ధంగా ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏకపక్షంగా నిర్ణయించిందని వాదించారు. గతేడాది కరోనా వ్యాప్తిచెందుతుందన్న కారణంతో ఎస్ఈసీ ఎన్నికలను వాయిదా వేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. నవంబరు 29 నాటికి రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 8,67,638 కి చేరిందని, రోజుకు సగటున వెయ్యి కొత్త కేసులు వస్తున్నాయని తెలిపారు. 'వాయిదా వేసిన ఎన్నికల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయం కోసం ఎన్నికల సంఘం ఆగస్టు 24న సీఎస్ కు లేఖ రాసింది. ప్రత్యుత్తరంగా సీఎస్ అక్టోబర్ 28న లేఖరాస్తూ కరోనా విషయంలో తీసుకున్న వివిధ చర్యల్ని వివరించారు. జిల్లా యంత్రాంగమంతా కరోనాను అదుపుచేసే పనిలో ఉందని తెలిపారు. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డప్పుడు ప్రభుత్వం వెంటనే ఎన్నికల సంసిద్ధత గురించి ఎన్నికల సంఘానికి తెలియజేస్తుందన్నారు. ఎన్నికల సంఘం అక్టోబర్ 28న అన్ని రాజకీయ పార్టీలతో, సీఎస్ తో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని మరోమారు పునరుద్ఘాటించారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్రంలో అనువైన పరిస్థితులు లేవని తెలిపారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం సలహా, అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఎన్నికల సంఘం నవంబర్ లో ఉత్తర్వులిచ్చిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కరోనాతో 6 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఏపీలో ఇప్పటికే 11,223 మంది పోలీసులు కరోనా బారినపడ్డారు'' అని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఎన్నికల సంఘం నవంబర్ 17 న జారీచేసిన ప్రొసీడింగ్స్ ను నిలుపుదల చేయాలని కోరారు.

### ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా
# విద్యార్థులకు స్వీట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ



భీమునిపట్నం : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎండిఓ ఆఫీస్ లో ఉన్న మానసిక భవిత పాఠశాలలో శుక్రవారం వైసీపీ సీనియర్ నాయుకుడు వాసుపల్లి.ఎల్లాజీ రావు (రంగ) ఆర్థిక సహాయంతో విద్యార్థులకు స్వీట్స్,వాటర్ బోటెల్స్, బాక్స్ లు పంపిణీ చేశారు.

అలాగే వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకట రమణ, ఈఓఅర్ఓ అప్పలరాజు, ఎంఈఓ కెవి బాలామణి, జీవీఎంసీ మూడో వార్డు అభ్యర్థిని మైలపల్లి భారతి షణ్ముఖరావు లు అలాగే...

భీమిలి పట్టణ వైఎస్ఆర్సీపీ బీసీ సెల్ అధ్యక్షుల వాసుపల్లి కొండబాబు, భీమిలి మండలం దివ్యాంగుల అధ్యక్షుల కాసరపు ఎల్లాజీ, వాడ మొదలు జగ్గారావు బోని సంజీవ రావు, ఐఈఆర్ పీకెజియాకుమారి తదితరులు పాల్గొన్నారు.

### మినీ ట్రక్కుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి నేటి నుంచి ఎంపికలు

భీమునిపట్నం : భీమునిపట్నం మండలంలో షెడ్యూల్ కుల ముల, వెనుకబడిన తరగతుల, ఆర్థి కంగా వెనుకబడిన తరగతుల సేవా సహకారసంస్థ, పౌరసరఫరాల శాఖ మరియు బ్యాంకు ల అనుసంధానం తో మినీ ట్రక్కుల కొరకు ధర ఖాస్తులు చేసుకున్న అర్హులైన వారిని స్థానిక ఎమ్డీఓ కార్యాలయంలో ఈ రోజు అనగా శుక్రవారం ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్డీఓపి వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు.అయితే ఈ కార్యక్రమానికి ధరఖాస్తు దారులు వారియొక్క ధరఖాస్తు ఫారం, ఆధార్,రేషన్ కార్డు, కులం, విద్యార్హతల ధృవపత్రాలతో మండల కార్యాలయం నకు హాజరు కావాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

### కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కందుల నాగరాజు జన్మదినం సందర్భంగా
# 32వవార్డులో మూడవరోజు చీరలు, దుప్పట్లు పంపిణీ



విశాఖపట్నం : కందుల నాగరాజు జన్మదిన సందర్భంగా పదివేల మందికి చీరలు, దుప్పట్లు ఇస్తానని ప్రకటించిన కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కందుల నాగరాజు మూడవరోజు 32వ వార్డు పరిధి లోని...

పుతివారి మాన్యం, మాన్యాల వీధి, భీం నగర్ లో తన పంపిణీ కొనసాగించారు. చీరలు, దుప్పట్లు అందుకున్న మహిళలు, వృద్ధులు నాగరాజు చేసిన సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోమని, నాగరాజు వంటి మంచి వ్యక్తి తమ మధ్య ఉండటం తమ అదృష్టమని ఆనం దం వ్యక్తం చేశారు.

కందుల వెంట ఎస్. కే.సలీం, కొట్నాల రమేష్, చిట్టెమ్మ, విజయ, మేరీ, జానకి, నీలబాబు, లారా, ఉమా, కేదా ర్నాథ్ తదితర ట్రస్ట్ సభ్యులు పంపిణీలో పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ : మహా విశాఖ 6 వ వార్డ్ లో గల పీఎంపాలెం విద్యుత్ సబ్ స్టేషను పరిధిలో బక్కన్నపాలెం 11కెవి ఫీడర్ సంబంధించిన నిర్వహణ పనులు కారణంగా ఈ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్హెచ్ కాలనీ, తులసినగర్ మరియు శంబువానిపాలెం గ్రామం తదితర ప్రాంతాలల్లో జోన్ 3 డివిజినల్ ఇంజనీర్ సింహాచలం నాయుడు ఆదేశాలు మేరకు విద్యుత్ సరపరా నిలిపి చేయనున్నట్లు వినియోగదారులు సహకరించ వలసినిదిగ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.నరేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు.

# ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా పల్లవి
### ఉత్తర్వులు అందజేసి అభినందించిన వీసీ ప్రసాదరెడ్డి



వీసీ ప్రసాద రెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న పల్లవి

ఆంధ్రాయూనివర్శిటీ : ఆంధ్ర విశ్వవిద్యా లయం ఆర్ట్స్-కామర్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా ఏయూ క్రీడా విభాగాధిపతి డాక్టర్ ఏ.పల్లవి నియమితులయ్యారు. గురువారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.రాజేంద్ర కర్మాకర్ నుంచి అసిస్టెంట్ ప్రిన్సి పాల్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య పల్లవిని ఆచార్యులు అభినందించారు.

# జగనన్న తోడు కార్డులు పంపిణీ



అచ్యుతాపురం : చిరు వ్యాపారులకు సహాయం చేయాలన్న ఉద్దేశ్యంతో సీఎం జగన్ మోహన్ రెడ్డి జగనన్న తోడు పథకం అమలు చేశారని వైసిపి నాయకులు ,యలమంచిలి మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నర్మాల కుమార్ అన్నారు. గురువారం దోసూరు గ్రామసచివాలయంలో అర్హులకు ఆయన చేతులు మీదుగా జగనన్న తోడు కార్డులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితి కార్యదర్శి చంద్రకళ , వెల్ఫేర్ అసిస్టెంట్ రీగన్, ప్రసన్న కుమార్ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మినీవ్యాన్‌ల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

గొలుగొండ : మండలంలోకి 13 మినీ వ్యాన్‌ల లబ్ధిదారుల ఎంపిక కొరకు ఈ నెల 4వ తేదీన వివిధ కార్పొరేషన్ల ద్వారా మినీ వ్యాన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న 157 మంది లబ్ధిదారులకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గొలుగొండ ఎంపిడిఒ డేవిడ్‌రాజ్ తెలిపారు. మిని ట్రక్కులు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మండల పరిషత్ కార్యాలయంలో ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో హాజరుకావాలని తెలియజేశారు.

### పూడిమడకలో ఘనంగా
# ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



అచ్యుతాపురం : మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో గురువారం శ్రీ స్వామి వివేకానంద దివ్యాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 గురు దివ్యాంగులకు వీల్ ఛైర్లు, ఒకరికి చంక కర్రలు, 50 మంది దివ్యాంగులకు దుప్పట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణిలు బి.అలేఖ్య, రబియా పర్వీన్, సిహెచ్ఓ కె.వేణుగోపాల్ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మేరుగు నూకరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను, చట్టాలను దివ్యాంగులకు అవగాహన కలిపిస్తున్నామన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో బొడ్డు కొండబాబు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### రైతు వ్యతిరేక వ్యవసాయక చట్టాలు రద్దుచేయాలని
# సిఐటియు రాస్తారోకో



విశాఖపట్నం : కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక వ్యవసాయక చట్టాలను తక్షణమే రద్దుచేయాలని, రైతులపై నిర్భంధాన్ని ఆపాలని సిఐటియు నగర అధ్యక్షులు ఆర్కేఎస్వీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఢిల్లీలో పోరాడుతున్న రైతుల పోరాటానికి సంఘీభావంగా స్వర్ణభారతి స్టేడియం వద్ద సిఐటియు ముఠా కళాశీలతో రాస్తారోకో చేపట్టింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయం కోసం మూడు వ్యవసాయక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. రైతులకు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగే ఈ చట్టాలను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా గత వారం రోజుల నుండి రైతులు పోరాడు తున్నారన్నారు. పోరాడుతున్న రైతులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్భంధ దమనకాండను ప్రదర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. అన్నం పెట్టే రైతున్నలకు గిట్టుబాటు ధర కల్పించకపోగా రైతు పండించే పంటను ఎంతకైనా కొనుక్కొని కార్పొరేట్ సంస్థలు ఎన్నిరోజులైన నిల్వచేసుకొనే అవకాశాన్ని కల్పించడం దుర్మార్గమన్నారు. రైతులు ఛలో ఢిల్లీకి వెళ్ళడానికి సిద్ధపడితే ఢిల్లీకి రాకుండా సరిహద్దుల్లో భారీ కేంద్ర బలగాలను దింపి, ముళ్లకంచెలు, కంటైనర్లు, పెద్ద పెద్ద భారికేడ్లు పెట్టి అడ్డుకుంటోంది. రైతులపై అమానుషంగా లాఠీచార్జి చేయడం, వాటర్ కెనాన్లను, టియర్ గ్యాస్లను ప్రయోగించి దమనకాండకు దిగడం అత్యంత దుర్మార్గమైన చర్య. హర్యానా ముఖ్యమంత్రి రైతులను ఉగ్రవాదులుగా వక్రీకరించడం తగదన్నారు. ఢిల్లీలో చలితీవ్రత ఉన్నప్పటికీ నేడు రైతులు అన్ని రాష్ట్రాల నుండి ఢిల్లీకి వెళ్లడం, వారి పోరాటపటిమకు నిదర్శనమన్నారు. రైతుల పోరాటానికి కార్మికవర్గం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించాలని, పోరాటాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలియ జేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్య క్షులు వి.కృష్ణారావు, కార్యదర్శి ఎ.సింహాచలం, నాయకులు కె.కుమారి, అనపర్తి అప్పారావు, భూలోక రావు, గురునాధరెడ్డి, మేస్త్రీ సబ్బి నూకరాజు, ఎస్ఎస్ఏ నాయకులు ఎల్.జె. నాయుడు, కె.ప్రభుదాస్, ఎల్. చిన్నారి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి భావం పెంపొందించి కోవాలి
### వైసీపీ ప్రముఖ వ్యాపారవేత్త బోకం శ్రీనివాస్



సబ్బవరం : భక్తి భావం పెంపొందించుకోవాలని వైసీపీ ప్రముఖ వ్యాపార వేత్త బోకం శ్రీనివాస్ పేర్కొన్నారు మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో గురువారం ముత్యాలమ్మ తల్లి పండుగ మహోత్సవం జరిగింది అమ్మవారి మహోత్సవంలో పాల్గొని ముందుగా ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి కరోనా నిబంధనలు పాటిస్తూ ప్రత్యేక పూజలు జరిపారు. ఈ అమ్మవారి పండగ ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో గ్రామ ప్రజలు జరుపుకోవడం ఆనవాయితీ .ఈ సందర్భంగా వైసీపీ నేత బోకం శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తి భావం పెంపొందించుకోవాలని గ్రామ ప్రజలను భక్తులను కోరారు భక్తి భావం అలవర్చు కొనప్పుడే సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండు తాయన్నారు అందరికి ఆయురారోగ్యాలు కలుగుతాయిన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బోకం అప్పల నాయుడు, బోకం కాసుబాబు గ్రామ ప్రజలు శ్రీనివాస్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మధురవాడలో
# సీపీఎం నాయకుల రాస్తారోకో, అరెస్టు



మధురవాడ : మహా విశాఖ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న చట్టాలను రద్దు చేయాలని రైతులు చేస్తున్న పోరాటం కు మద్దతుగా గురువారం మధురవాడ కూడలి వద్ద సీపీఎం నాయకులు రాస్తా రోకో ను నిర్వహించారు.సి పి ఎం జోన్ నాయకులు పి రాజుకుమర్ ను పోలీసులు తన ఇంటివద్ద ముందస్తు అరెస్టు చేశారు.మోడీ తో పాటు రాష్ట్రం లో జగన్ ప్రభుత్వం కూడా రైతులకు ప్రజలకు వ్యతిరేకంగా నిర్భంధ్లన్ని ప్రయోగిస్తూ పోరాటాలను అణిచివేతకు పాల్పడుతుందని సిపిఎం విమర్శించింది. రైతులకు నష్టం కలిగించే విధంగా నిత్యవసర వస్తువుల ధరలు అదుపు లేకుండా పెంచే చట్టాలను రద్దు చేసే వరకు పోరాడుతామని,దేనికి ప్రజల మద్దతు అవసరమని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ గురుమూర్తి రెడ్డి, బి కొండమ్మ, ఎం ఆర్ డి రాజు, పి రాము, జే తులసమ్మ, కే రాజేశ్వరి, ఎం రామారావు తదితరులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ఇ-టెండరు ప్రకటన నెం. VSKP-EL-C-RT-139ER, తేదీ. 25.11.2020

**పని పేరు:** ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ పరిధిలో (1) కోరాపుట్-సింగపూర్ రోడ్, (2) కోరాపుట్-జగదల్‌పూర్ సెక్షన్ & (3) కోరాపుట్-దార్లిపుట్ సెక్షన్ మధ్యన డబ్లింగ్‌నకు సంబంధించి పైపు పుషింగ్ విధానం ఉపయోగించుట ద్వారా అండర్ గ్రౌండ్ లైన్స్‌కు ఎలెక్ట్రికల్ ఓవర్ హెడ్ లైన్లు షిఫ్టింగ్ పనులు మరియు ఓవర్ హెడ్ లైన్లు యొక్క మోడిఫికేషన్.

**టెండరు విలువ:** ₹ 44.5 లక్షలు, బయానా: ₹ 89,000.00, పని పూర్తి చేయు కాలం: 3 (మూడు) నెలలు.

**ఇ-టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 18.12.2020న 1200 గంటలకు

పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా ఇట్టి ఇ-టెండర్లుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లును తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు అన్నియూ ఎలాంటి పరిశీలన లేకుండానే తప్పక తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్ http://www.ireps.gov.in

సూచన: ఈ టెండరునకు ఏదైనా మార్పు/ సవరణ జారీ చేయబడినదేమో తెలుసుకొనుటకు టెండరు ముగింపు తేదీకి పదిహేను రోజులు ముందు వెబ్‌సైట్‌ను మరొకసారి చూడవలసినదిగా నిశ్చసనీయ టెండరు దారులకు సలహా ఇవ్వటమైనది.

టెండరుదారు యొక్క అన్ని సూచనలను టెండరుదారులు జాగ్రత్తగా చదవాలి మరియు టెండరు డాక్యుమెంట్లు యొక్క చాప్టర్-2 టెండరు ఫారం (రెండవ షీటు) పట్టిక-I పేరా 3.1 (అదనపు చెక్ లిస్టు) చెక్ లిస్టులు తోపాటు అన్ని సూచనలు సమ్మతించినట్లు నిర్ధారించాలి, పట్టిక-C/G & G1 సక్రమంగా పరిశీలించి మరియు చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం చేసినది దాఖలు చేయాలి.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (Con), విశాఖపట్నం

PR-68/CD/20-21


# రైతు వ్యతిరేక వ్యవసాయక చట్టాలు రద్దుచేయాలి
### రైతుల పోరాటానికి పోర్టు ఎంప్లాయిస్ సంపూర్ణ మద్దతు



విశాఖపట్నం : కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతులకు నష్టదాయకమైన మూడు వ్యవసాయక చట్టాలను తక్షణమే రద్దుచేయాలని పోర్టు & డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.యస్.పద్మనాభరాజు డిమాండ్ చేశారు. ఢిల్లీలో పోరాడుతున్న రైతుల పోరాటానికి యునైటెడ్ పోర్టు & డాక్ ఎంప్లాయిస్, కాంట్రాక్టు కార్మికుల మద్దతు ఉంటుందని తెలిపారు. మూడు వ్యవసాయక చట్టాలను రద్దుచేయాలని దేశవ్యాప్తంగా గత వారం రోజుల నుండి పోరాడుతున్న రైతులపై కేంద్ర బిజెపి ప్రభుత్వం దమనకాండను ప్రదర్శించడాన్ని ఖండిస్తూ నేడు పోర్టు మెయిన్ గేటువద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టింది. అన్నం పెట్టే రైతున్నలకు గిట్టుబాటు ధర కల్పించడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. పైగా కార్పొరేట్ వ్యవసాయకోసం ఈ మూడు చట్టాలను తీసుకురావడంతో రైతులతో పాటు ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రైతులు ఛలో ఢిల్లీకి వెళ్ళడానికి సిద్ధపడితే ఢిల్లీకి రాకుండా సరిహద్దుల్లో భారీ బలగాలను దింపి, ముళ్లకంచెలు, కంటైనర్లు, పెద్దపెద్ద భారికేడ్లు పెట్టి అడ్డుకుంటోంది. రైతులపై అమానుషంగా లాఠీచార్జి చేయడం, వాటర్ కెనాన్లను, టియర్ గ్యాస్‌లను ప్రయోగించి రైతులపై దమనకాండకు దిగడం అత్యంత దుర్మార్గమని అన్నారు. హర్యాని ముఖ్యమంత్రి రైతులను ఉగ్రవాదులుగా వక్రీకరించడం తగదన్నారు. ఢిల్లీలో చలితీవ్రత ఉన్నప్పటికీ నేడు రైతులు అన్ని రాష్ట్రాల నుండి ఢిల్లీకి వెళ్లడం, వారి పోరాటపటిమకు నిదర్శనమన్నారు. రైతుల పోరాటానికి కార్మికవర్గం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించాలని, పోరాటాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలియజేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాధ్, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## స్వచ్ఛతలోనూ మేటి

ఆరోగ్యవంతమైన మానవ జీవనానికి అవసరమైన సదుపాయాల్లో పరిశుభ్రత ప్రాధాన్యం తక్కువ కాదు. పారిశ్రామిక, ఎలక్ట్రానిక్, మానవ విసర్జిత వ్యర్థాల నిర్వహణ ఎంతో ముఖ్యం. అన్నివిధాలా మెరుగైన రాష్ట్రంగా మార్చాలనుకుంటున్న ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణలోనూ తనదైన ప్రత్యేకతను చాటుతున్నది. గతంలో మురుగునీటి శుద్ధి అంటే హైదరాబాద్‌లోనే కనిపించేది. కానీ ఇప్పుడు మున్సిపాలిటీల్లో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీకి దీటుగా మిగతా నగరాల్లో బాధ్యతను ఎంఏయూడీ, సీఅండ్‌ఎండీఏ చేపట్టింది. అందుకు దేశంలోనే తొలిసారిగా 1997లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్‌ఎస్టీపీ) ప్రారంభించారు. పలు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు యుద్ధప్రాతిపదికన పూర్తవుతున్నాయి. బహిరంగ మల విసర్జనరహిత దిశగా రాష్ట్రం అడుగులు వేస్తున్నది.

అనారోగ్యం, శిశు మరణాలు, ఇతర అనారోగ్యాలు రావడానికి బహిరంగ మలవిసర్జన ఒక కారణమై ఉండవచ్చని భావిస్తూ వచ్చాం. దానికి నివారణగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నది. మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాలకు పట్టణాలకు నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేసే సంకల్పం కొనసాగుతున్నది. ఇది పూర్తయితే మరుగుదొడ్ల వాడకం గణనీయంగా పెరుగుతుంది. వినియోగం కోసం సరఫరా చేసిన నీటిలో 70-80 శాతం మురుగునీరు ఉత్పన్నమవుతుంది. మురుగునీటిని శాస్త్రీయంగా శుద్ధి చేయకుంటే అది మరింత ప్రమాదకరమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం దార్శనికతతో అన్ని పట్టణాల్లో మురుగు నిర్వహణ కోసం ఎఫ్‌ఎస్టీపీ, ఎస్టీపీల స్థాపనపై దృష్టిపెట్టింది. మరుగుదొడ్లు నిర్మించడమే కాదు వాటిలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను శుద్ధిచేసి నిర్వహించే అంశాన్ని గుర్తించడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఇప్పుడు భారీ సంఖ్యలో పట్టణాలు ఓడీఎఫ్ ౦౦ దిశగా అడుగువేస్తున్నాయి. వరంగల్, సిరిసిల్ల పట్టణాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నెలకొల్పిన ఎఫ్‌ఎస్టీపీలు విజయవంతంగా నడుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 71 పుర పట్టణాల్లో భౌగోళిక సారూప్యం, ఇతర కార్యనిర్వహణ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏడు క్లస్టర్ ప్యాకేజీలను ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్‌లో 10-11 పురపాలక సంఘాలుంటాయి. సిద్దిపేట, నిర్మల్‌లో ప్లాంట్ల నిర్మాణం చివరి దశలో ఉన్నది. వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు 71 ప్లాంట్లు వాడుకలోకి తేవాలనేది ప్రభుత్వ లక్ష్యం.

వెయ్యి మంది జనాభాకు ఒక టాయిలెట్ ఉండటమనేది హక్కుగా పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ నిర్దేశించింది. సమ్మిళిత పట్టణ పారిశుద్ధ్య సాధన దిశలో సురక్షిత, ప్రజావసరాలకు సరిపడా మరుగుదొడ్లను నిర్మించడం ఒక ముందడుగు. ప్రతి పట్టణంలో మొబైల్ టాయిలెట్లను అందుబాటులోకి తేవడం, మహిళల అవసరాలను తీర్చడానికి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి మహిళా మరుగుదొడ్లను ఏర్పాటుచేయడం ప్రభుత్వ కార్యాచరణలో భాగమవుతున్నాయి. పట్టణ మహిళా స్వయం సహాయక సమాఖ్య, ఆసక్తిగల పౌరసమాజ సంస్థలు- ఉదాహరణకు తెలంగాణ వికలాంగుల సమాఖ్య వంటి వాటికి పబ్లిక్ టాయిలెట్ నిర్మా ణం, నిర్వహణ అప్పగించడం ద్వారా కొందరికి జీవనోపాధి కలుగుతున్నది.

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'పట్టణ ప్రగతి' కార్యక్రమంలో పచ్చదనం, పరిశుభ్రత, పౌరసేవలు, వాటికి సాంకేతిక తోడ్పాటు, పారిశుద్ధ్యం, మంచినీటి పరఫరా, వ్యర్థాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక చర్యలను నిర్దేశించింది. సమగ్రాభివృద్ధి కార్యక్రమాల అజెండా ఇది. అన్ని పట్టణాల్లో వైకుంఠధామాలు ఉండాలని, ప్రస్తుతం ఉన్న శ్మశానవాటికలను వైకుంఠధామాలుగా మార్చాలని నిర్ణయించారు. పురపాలక సంస్థలు తమ సాధారణ బడ్జెట్‌లో కచ్చితంగా 10 శాతం నిధులను పచ్చదనం కోసం కేటాయించాల్సి ఉంటుంది. దేశంలో పట్టణాభివృద్ధికి ఈ స్థాయిలో సమీకృత చర్యలు, కార్యక్రమాలు చేపట్టిన అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి.

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కొత్త చట్టం తేవడం, నెలనెలా జీతాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవడం సంతోషకరం. అలాగే పారిశుద్ధ్య నిర్వహణలో గుణాత్మక మార్పులకు ప్రథమ సారథులైన లక్షకు పైగా ఉన్న స్వచ్ఛ కార్మికుల స్థితిగతుల మెరుగుదలకు చర్యలు చేపట్టాల్సి ఉన్నది. వారికి ఉద్యోగ భద్రత, సామాజిక గౌరవం లభించాలి.

# ప్రజా సేవలో వెంకునాయుడు

## సొంత నిధులు రూ.50 వేలుతో బెంచీలు



అచ్యుతాపురం : వైసిపి నాయకుడు కూండ్రపు వెంకునాయుడు ప్రజా సేవకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు . గురువారం ఆయన అచ్యుతాపురం పంచాయితీలో కోనెంపాలెం , కుమారపురం జంక్షన్ లలో తన సొంత నిధులు రూ.50 వేలుతో 10 బెంచీలు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యు వి రమణమూర్తిరాజు ప్రోత్సాహంతో అచ్యుతాపురం పంచాయితీ పరిధిలో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నాన్నారు . ప్రజల అవసరాలు , బ్రాండిక్స్ తో పాటు ఇతర కంపెనీలకు వెళ్లే ఉద్యోగులు వేచి ఉండేందుకు బెంచీలు ఏర్పాటు చేశానన్నారు.

ఈ కార్యక్రమంలో రాజాన రాజు , రెడ్డి నాగ అప్పారావు, రాజాన నరసింగరావు, రాజాన సన్యాసినా యుడు , ధర్మిరెడ్డి కృష్ణ , లాలం వెంకటరావు , లాలం మహేష్ , గోవాడ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు .

## తహశీల్దార్ కార్యాలయం ముందు దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి



మాకవరపాలెం : మాకవరపాలెం తహశీల్దార్ కార్యాలయం ముందు భాగంలో దేశ నాయకులైన సర్దార్ వల్లభాయ్‌పటేల్, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బిజెపి మండల కమిటీ అధ్యక్షులు గవిరెడ్డి రఘుసత్యసింహచక్రవర్తి, జిల్లా ఒబిసి మోర్చ అధ్యక్షులు బంగారు ఎర్రినాయుడు గురువారం మాకవరపాలెం తహశీల్దార్ రాణీఅమ్మాజికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకవరపాలెం బిజెపి ఆధ్వర్యంలో గతంలో అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా డిసెంబరు 25న భారతరత్న అటల్ భీహారి వాజ్‌పేయి, ఏకతా దీవాస్ రోజు సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాంను అక్టోబర్ 25 ప్రారంభించుటకు అవకాశం కల్పించాలని కోరారు.

## ఆటో డ్రైవర్లతో సమావేశం

నాతవరం : నర్సీపట్నం రూరల్ సిఐ కె.అప్పలనాయుడు గురువారం తాండవ జంక్షన్‌లో ఆటో యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయడంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆటో ముందు సీట్లలో ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. వేగంగా ఆటోను నడపటం, ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించడం చేయలేదన్నారు. అలాగే ఆటోలో భౌతిక దూరం పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎస్సై రమేష్ ఉన్నారు.



**యువకుడి దాడిలో తీవ్ర గాయాలుపాలై కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న ప్రియాంక ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ జోన్ 3 టౌన్ లెవెల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్) అధ్యక్షురాలు, వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 39వ వార్డు లో సచివాలయం సిబ్బంది, వాలంటర్లు, ఆర్పీలు, వైసీపీ కార్యకర్తలు కలిసి క్రొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లి'సేవ్ ఉమెన్‌లి 'సేవ్ ప్రియాంక' అంటూ నినాదాలు చేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు. అనంతరం కొల్లి సింహాచలం మాట్లాడుతూ, ప్రియాంక పై దాడి చేసిన యువకుడ్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.**

# దివ్యాంగులకు అండగా నిలవాలి

## - గాజువాక వైకాపా ఇంఛార్జ్ దేవన్ రెడ్డి



గాజువాక : జీవీఎంసీ 76 వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీ లో ప్రపంచ వికలాంగుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి ,న్యూ పోర్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడాపు నాయుడు పాల్గొన్నారు. ముందుగా దేవన్ రెడ్డి మాట్లాడుతూ శరీరం లోని భాగాలకు పుట్టుకతోనో, లేదా వ్యాధుల ద్వారానో లేక ప్రమాదాల కారణంగానో అంగవైకల్యం సంభవిస్తుందని, అటువంటి వారికి మనం అండగా నిలవాలని, మనోధైర్యాన్ని నింపి, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అనంతరం దివ్యాంగులకు దేవన్ రెడ్డి చేతుల మీదుగా చిరు సత్కార్యం చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ జగదీష్, తాటికొండ అచ్చుత్, హౌసింగ్ బోర్డ్ ప్రసిడెంట్ బ్రహ్మానందం రెడ్డి,వికలాంగుల ప్రెసిడెంట్ తలబత్తుల సతీష్,సెక్రెటరీ కుక్కల నారాయణ రావు,పోలిశెట్టి చంద్రశేఖర్,గాలి బాబురావు,యడ్ల ఈశ్వర రావు,రెడ్డి,కృష్ణ,స్వామి నాయుడు,గాలి పావని,రమణ,చంద్రశేఖర్,నత్తిబాబు,ఆచారి, అండిబోయిన సన్నీ,వార చైతన్య,సుధా,గౌరీ,దేవి తదితరులు పాల్గొన్నారు.

# పంచాంగం

మాసం : కార్తీక ; తిథి : చవితి సా.5.35; పునర్వసు ప.12.15; రా.వ.8.22ల 10.00.

**శుక్రవారం 04 -12 -2020**

**మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

**వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

**మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

**కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

**సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

**కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

**తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవులు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

**వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

**ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.

# శేషనయనా... అనంత పద్మనాభ

సంకీర్తన





శ్రీ మహావిష్ణువు 108 దివ్యదేశాల్లో అత్యంత ముఖ్యమైన క్షేత్రం తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం. పాలకడలిలో శేషపాన్పుపై పవళించిన ఆ చిద్విలాసమూర్తి మహారూపాన్ని ఇక్కడ వీక్షించవచ్చు. పద్మాన్ని నాభి యందు కలిగిన వాడు కాబట్టే ఆ పురుషోత్తముడిని పద్మనాభుడిగా పిలుస్తాం. శ్రీఅనంత పద్మనాభస్వామి ఆలయంలో వెలువడిన సంపద యావత్ ప్రపంచదృష్టిని ఆకర్షించింది. లక్షల కోట్లు విలువచేసే సంపదతో స్వామివారు ప్రపంచంలోనే అత్యంత ఐశ్వర్యమూర్తిగా అవతరించారు. అనంతమంటే అంతు లేనిదని అర్థం. అంత సంపదను వందల సంవత్స రాలుగా ఆలయంలో నిక్షిప్తం చేసుకున్న ఆ స్వామి నిజంగా అనంతుడే. లోకంలో సంభవించే విపత్తులను అడ్డుకునేందుకు ఆ పరంధాముడు పలు అవతారాలు ఎత్తి శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేశాడు. ఆర్తితో పిలిస్తే భక్తులను ఆదుకుంటారు. అనంతమైన ఆ పరమాత్ముడు స్వయంగా వెలసిన క్షేత్రమే శ్రీఅనంత పద్మనాభక్షేత్రం.

స్వామిని పూజించిన బలరాముడు

ఈ ఆలయ ప్రస్తావన పలు పురాణాల్లో, ఇతిహాసాల్లో వుంది. బలరాముడు ఆలయాన్ని సందర్శించి పూజలు చేసినట్టు శ్రీమద్ భాగవతం తెలుపుతోంది. స్వామివారి మహత్యాన్ని పేర్కొంటూ 12 మంది ఆళ్వా రుల్లో ఒకరైన నమ్మాళ్వారు అనేక రచనలు చేశారు. కలియుగం ప్రారంభమైన రోజున ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. అయితే ఈ ఆలయ చరిత్రపై కచ్చితమైన సమాచారం లేదు. వేల సంవత్స రాల నుంచి ఆలయం నిత్యపూజలు అందు కున్నట్టు ఆలయానికి చెందిన రికార్డులు వెల్లడిస్తున్నాయి.

అనంతశయన మహత్య

అనంతపద్మనాభుడు ఎలా ప్రత్యక్షమయ్యాడు అన్న దానిపై అనంతశయన మహత్య గ్రంథం వివరాలను తెలుపుతోంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం దివాకరముని అనే విషు? భక్తుడు వుండేవాడు. నిత్యం విష్ణునామ సంకీర్తనతో ఆయన నిమగ్నమయి వుండేవాడు. ఒకరోజు భగవానుడు ఆయనకు బాలుని రూపంలో ప్రత్యక్షమయ్యాడు. ముద్దులొలికే ఆ పిల్లవాడిని చూసిన దివాకరుడు తన నివాసంలో వుండాలని కోరాడు. అయితే ఆ పిల్లవాడు సాక్షాత్తు పరమాత్ముడే అన్న అంశాన్ని ముని గుర్తించలేకపోయారు. దీనిపై స్పందించిన చిన్నారి తాను చేసే పనులకు ఎలాంటి అడ్డుచెప్పకూడదని ఒకవేళ చెబితే వెళ్లిపోతానని నిబంధన పెడుతాడు. కొన్నిరోజులకు పిల్లవాడు చేసే అల్లరి ఎక్కువయింది. ఒకనాడు ముని తపోదీక్షలో వుండగా సాలగ్రామాలను తీసుకువచ్చిన స్వామి అతని నోటిలో వేస్తాడు. దీంతో మునికి తపోభంగమైంది. పిల్లవాడిపై పట్టరాని కోపం ప్రదర్శిస్తాడు. పిల్లవాడు వెంటనే అద ృశ్యమవుతూ తనను తిరిగి చూడాలంటే అనంతన్‌కాడు దగ్గరకు రమ్మని చెబుతాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే తన నివాసంలో బాలుడిగా వున్న అంశాన్ని దివాకరముని గుర్తిస్తాడు. వెంటనే స్వామిని అన్వేషిస్తూ సముద్రతీరప్రాంతానికి చేరుకుంటాడు. అక్కడ వున్న భారీ వ ృక్షం నేలపై పడి శ్రీమహావిషు?వుగా రూపాంతరం చెందింది. స్వామివారు భారీ రూపంగా దర్శనమిచ్చారు. అనంతుని దర్శనంతో అమితానందం చెందిన దివాకరముని అంతటి పెద్ద రూపాన్ని వీక్షించలేనని ప్రార్థించడంతో యోగదండం కంటే మూడింతలు పెద్దగా మారిపోయారు. స్వామిని కనులారా వీక్షించిన ముని స్వామికి ఒక టెంకాయలో మామిడికాయను వుంచి ప్రసాదంగా ఇస్తారు. ఇప్పటికీ ఈ పూజా విధానం ఆలయంలో కొనసాగుతుండటం విశేషం. ఈ క్షేత్రానికి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యంలో వుంది. నంబూద్రి సన్యాసి వివమంగళ స్వామియార్ అనే విష్ణు భక్తుడికి కూడా అనంతుడు ఇలానే దర్శనమిచ్చినట్టు తెలుస్తోంది.

మూలవిరాట్టును మూడు ద్వారాల్లో నుంచి దర్శించాలి

స్వామివారి మూలవిరాట్టును ఒక ద్వారం నుంచి మనం వీక్షించలేం. పెద్ద విగ్రహం కావడంతో తలను, చేతిని, పాదాలను వేర్వేరు ద్వారాల నుంచి వీక్షించాలి. రాజా మార్తాండవర్మ పాలనా సమయంలో వేల సాలగ్రామాలతో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆ రోజుల్లో 4వేల శిల్పకారులు, 6వేలమంది కార్మికులు, నూరు ఏనుగులు ఆరు నెలల పాటు శ్రమించి ఆలయంలోని పలు కళాకృతులను ఏర్పాటుచేసినట్టు తెలుస్తోంది.

**PASSPORT MISSING**

I, Gandham Gangadhar S/o.Sanjeeva Rao, D.No:4-28/2, SC Colony,Chivatam, West Godavari. I had lost my Passport Bearing No: L5191668,While Travelling At Birla Junction and could not trace.If found Contact me. Cell No : 7780590521

**రేషన్‌కార్డు పడిపోయినది**

యానాం గిరియంపేటకు చెందిన దోమ ఈశ్వరరావు S/o రామకృష్ణకు చెందిన రేషన్‌కార్డు నెంబరు : 465217 పడిపోయినంది. నవంబర్ 25వతేదీన ఇంటి వద్ద నుండి ఆఫీసు నిమిత్తం యానాం వస్తుండగా కురసాంపేట ప్రధానరోడ్డు మార్గంలో పడిపోయింది. ఇది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగోరుచున్నాము.

చిరునామా :
దోమ ఈశ్వరరావు
S/o.రామకృష్ణ
డోర్ నెం: 5-7-92
గిరియం పేట, యానాం.
సెల్ నెం: 7036240606

# రేషను పంపిణీ ట్రక్కుల లబ్దిదారులకు నేడు ఇంటర్వ్యూలు



నర్సీపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కీ రేషన్ పంపిణీ కి రవాణా ట్రక్కుల కై నేడు ఇంటర్వ్యూ లు నిర్వహిస్తామని మండలం పరిషత్ అభివృద్ధి అధికారిణి యన్,జయమాదవి, మున్సిపల్ కమిషనర్ కనకారావు విలేకరులకు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు మున్సిపాలటి పరిధి లొని లబ్దిదారులకు, మధ్యాహ్నం 2 గంటలకు రూరల్ లబ్దిదారులకు మండ లం పరిషత్ కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూ లు నిర్వ హిస్తామని చెప్పారు.విదిగా లబ్దిదారులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకుని రావాలి అనే విషయం లబ్దిదారులకు తెలిపారు.

# ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



ఆనందపురం : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం ఆనందపురం ఎండిఓ ఆఫీస్ లో జిల్లా ఉపాద్యక్షుడు పి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా దివ్యంగులకు పరికరాలుతో పాటు నలబై మంది కి బాక్స్ లు పంపిణీ చేశారు అనంతరం నివహించిన ఆటల పోటీ లలో వికలాంగులు ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేముడు బాబు, ఉపాధ్యక్షుడు కోరాడ అప్పలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దాం -ఏఐటియూసి



గాజువాక : ఉక్కు కార్మికులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యల పరిస్కారానికై ఉద్యమిద్దామని స్టీల్ ఏ.ఐ.టి.యూ.సి ప్రధానకార్యదర్శి డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్ ఏ.ఐ.టి.యూ.సి జనరల్ కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి ఆదినారాయణ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ లో కార్మికుల అనేక సమస్యలు దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్నాయని, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలన్నారు. వేతన ఒప్పంద కాలపరిమితి ముగిసి నాలుగేళ్లు గడిచినప్పటికీ నేటికీ కూడా పూర్తిస్థాయి వేతన చర్చలు జరగకపోవడం సరికాదన్నారు. ఉక్కు ఉద్యోగులకు ఈ.ఎల్ ఎన్ క్యాష్మెంట్, ఉక్కు ఉత్పత్తి జరుగుతున్న విభాగాలలో ఇన్సెంటివ్ ను పెంచాలని, అలాగే అన్ని సర్వీస్ జోన్ లలో ఇన్సెంటివ్ ను మెరుగుపర్చాలన్నారు. ఉక్కు లోని అన్ని విభాగాలలో ఏ.ఐ.టి.యూ.సి మహా సభలు పూర్తి చేయాలనీ ఆయన అన్నారు. ఉక్కు కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం అన్ని విభాగాలలో యాజమాన్యంపై ఒత్తిడి తీసుకోని రావాలన్నారు. యూనియన్ అధ్యక్షులు జి.బోసుబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఏ.మసేన్ రావు, కె.ఎస్.ఎన్.రావు, నరేష్ కుమార్, మిశ్రా, జె.రామకృష్ణ, బోండా అప్పారావు, జయ, కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, ఎల్లేటి శ్రీనివాస్, డి.దేముడు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుంది

## మాజీ కౌన్సిలర్ చెరుకూరి సతీష్ ఘనంగా జన్మదిన వేడుకలు

## బిచ్చగాళ్ళకు రగ్గులు పంపిణీ



నర్సీపట్నం : నిరుపేదలను ఆదుకోవడం వారికి సహాయం చేయడంలో నిజమైన ఆనందం ఉంటుందని మాజీ కౌన్సిలర్ చెరుకూరి సతీష్ అన్నారు. తన కుటుంబ సభ్యులతో కలిపి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయ సన్యాసి పాత్రుడు తో పాటుపలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అతని ఇంటికి వచ్చి ప్రత్యేకంగా అభినం దనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరా మార్కెట్ దగ్గర ఉన్న ఒక గుడి వద్ద భిక్షాటన చేస్తున్న వారందరికీ పంపిణీ చేశారు. కొంత నగదును ప్రతి ఒక్కరికి పంపిణీ చేశారు. ఆయనతో పాటు మళ్ళ గణేష్, మామిడి శ్రీను, దాడి బుజ్జి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు. తన భార్య కుమారుడు కోడలు బంధువులు తన జన్మదిన వేడుకలు ఘనంగా జరిపిడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

**BEFORE THE HONOURABLE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**E.P. 14/2020 in O.S. 720/2012**

**Between:**
**Akbar Sha** ...DHR/Plaintiff
**And:**
**Sri Naimutulla Khan @ Hudud Khan and 2 other** ...JDRS/Defendants

**E.P. NOTICE**

To:
JDR-1 : Sri Naimutulla Khan @ Hudud Khan, S/o Abdul Razaak Khan, Mohammedan, aged about 58 years. residing at Door no 14-460/1, Sector III, Kanakadurga Nagar, Arilova, Visakhapatnam.

JDR-2 : Abdul Wahab Khan, S/o Attar Mohammad Khan, Mohammedian, aged about 66 years, residing at 5th lane, Sairam Colony, Kommadi Junction, Visakhapatnam.

JDR-3 : Abdullah Khan, S/o Shamshed Khan, Mohammedian, aged about 51 years, residing at 5th lane, Sairam Colony, Kommadi Junction, Visakhapatnam.

Take notice that the above E.P. filed by the Decree holder against all three of you stands posted to **28-12-2020** for your appearance. If you have any objection you may attend either personally or through an Advocate before the above said court by **10.30 A.M,** failing which the matter will be decided exparte in your absence.

**Hearing Date 28-12-2020**

**(By Order of the Court)**

**Smt. V.Usha Rani,**
**Advocate,**
**D.No. 8-4-49, Prasanthi Nagar,**
**Peda waltair,**
**Visakhapatnam**
**Cell No : 9440060862**

**IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM**
**O.S. 661/2019**

Between :
**Canara Bank,** Seethammadhara Branch, Visakhapatnam, Rep. by its Authorized Signatory P. Deepika ...Plaintiff - Bank
And
**P.Padmavathi** …Defendant

**SUMMONS**

To, **The Defendant :**
**P.Padmavathi,** W/o. Late P. Harish,
Hindu, aged about 42 years,
R/at D.No. 49-39-2/2, NGGO's Colony,
Akkayyapalem, Near Vasista Enclave,
Visakhapatnam-530016.

Please take notice that the above named plaintiff-Bank has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other relief's and the suit stands posted to **14-12-2020** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **14-12-2020 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)

**P. NAGINI**
Advocate
Visakhapatnam.
Cell :9848521975

# ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



పరవాడ : పరవాడ భవిత సెంటర్ నందు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం గురువారము ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పైల శ్రీనువాసురావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, వైసీపీ మండలపార్టి ప్రెసిడెంట్ సిరపురపు అప్పల నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు సమగ్ర శిక్ష అభియాన్ వారు అందిస్తున్న సేవలు లో భాగంగా అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిలు చేతులు మీదగా బహుమతులును అందజేశారు. తదనంతరం పరవాడ భవిత సెంటర్ లో టీచింగ్ బోధన ఉపకర్ణాలు స్టాల్ ను సందర్శించారు. ఈ యొక్క కార్యక్రమంలో మండల విద్యశాఖాధికారిణి ఎం. సునీత, పిఎమ్‌సి చైర్మన్ పైల హరీష్, వై.సి.పి నాయకులు బండారు రామారావు,హెచ్ ఎమ్ సి.హెచ్ నాగేశ్వరరావు, పైల పైడం నాయుడు, చీపురుపల్లి హరీష్, భవిత విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 2వ వార్డు సంగివలస కాలనీ లో బోర్ ను ప్రారంభించిన వైసీపీ నాయకులు



భీమునిపట్నం: జివియంసి భీమిలి జోన్ రెండవవార్డ్ సంగివలస కాలనీ త్రాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు 2వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిని శిల్లా సరళా రాణి కరుణాకర్ రెడ్డి కి తెలియజేశారు..ఈ విషయాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ దృష్టికి తీసుకొని వెళ్ళారు. ఆయన వెంటనే సంగివలస కాలనీ మరియు కొన్ని ప్రాం తాల్లో 5 కొత్త బోర్లు మంజూరు చేశారు.

ఈ సందర్భంగా...

బుధవారం 1వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి అక్కరమాని రాము నాయుడు, సరళారాణి కరుణాకర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో... సీని యర్ నాయకులు చిల్ల భాస్కర్ రెడ్డి, వార్డు అధ్యక్షులు పీతల వెంకట ప్పారావు, కొండపు నారాయణ, చెట్ల నర్సి , జీరు ప్రమీల, వాసుపిల్లి నరేంద్ర వార్డు వాలంటీర్స్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ డ్యూటీ మీట్ ను ప్రారంభించిన సీపీ



విశాఖ సిటీ: జనవరి నెలలో జరుగబోయే స్టేట్ పోలీస్ మీట్ లో భాగంగా గురువారం మూడు రోజుల సిటీ పోలిస్ డ్యూటీ మీట్ ను నగర పోలీస్ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా( ఐ.పి.ఎస్) నగర పోలీస్ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వి.సురేష్ బాబు, డి. సి. పి(క్రైమ్స్), అజిత వేజెండ్ల, ఐ.పి.ఎస్., ఏ.డి.సి.పి(ఎస్.ఈ.బి), ఎమ్.రజిని, ఏ.డి.సి.పి (అడ్మిన్). కే.వేణుగోపాల నాయుడు, ఏ.డి.సి.పి (క్రైమ్స్) కే. సుబ్ర హ్మణ్యం, ఏ.డి. సి.పి(ఏ. ఆర్) సి.ఐ (సి.సి.ఆర్.బి) ఎమ్. సాల్మన్, ఏ.సి.పి(ఏ.ఆర్) ఆర్.ఐ(అడ్మిన్) ఆర్.ఐ (సి.ఎస్.డబ్ల్యూ) మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యుడిపై ఉపాధ్యాయుడు దాడి

# ఆందోళనకు దిగిన వైద్యులు..రక్షణ కల్పించాలని డిమాండ్



పాడేరు : విశాఖ ఏజెన్సీ పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యుడిపై ఉపాధ్యాయుడు దాడిచేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. దీంతో వైద్యులు సిబ్బంది విధులను బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం కొక్కిరాపల్లి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాంబాబు బంధువులు తీవ్ర అనారోగ్యంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే వైద్య సేవలు అందించినప్పటికీ చికిత్స పొందుతూ రోగి మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న రోగి (మృతుని) బంధువులు ఉపాధ్యాయుడు రాంబాబు కోపంతో వైద్యుడిపై దాడి చేశాడు. తరచుగా వైద్యులపై దాడులు చేయడాన్ని ఖండిస్తూ స్థానిక వైద్యులు సిబ్బంది తమకు రక్షణ కల్పించాలని ఆస్పత్రి ఆవరణంలో ఆందోళన చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ అధికారులు అక్కడ చేరుకొని ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వైద్యులు ఆందోళన విరమించి రోగులకు వైద్య సేవలు అందించారు.

# సత్యదేవుని సన్నిధిలో 'హరిహర సదన్' కాటేజీ నందు

## రూము ఒక్కంటికి రూ.5,00,000/- విరాళం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానం నందు ఉన్న "హరిహర సదన్" కాటేజీ నందు ఉన్న రూము ఒక్కంటికి విశాఖపట్నం కు చెందిన సుగ్గు అప్పారావు రెడ్డి రూ.5,00,000/- విరాళమును చెక్కు రూపేనా దేవస్థానం పిఆర్వో కొండలరావు కు అందజేశారు.ఈ సందర్భంగా దాతలను పిఆర్వో అభినందించారు.

# వికలాంగులకు చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ




గాజువాక : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా 76వ వార్డు పెదనడుపూరు శ్రీ కుంచ మాంబ ఆలయం వద్ద గాజువాక నియోజకవర్గ కన్వీనర్ డా.కరణంరెడ్డి నరసింగరావు ఆర్ధిక సహాయంతో కొంతమంది వికలాంగులకు చీరలు, నిత్యవసర సరకులు మోదీ కిట్లను అందజేసారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ డాక్టర్ కే.ఎన్.ఆర్ మాట్లాడుతూ దేశంలో గల దివ్యాంగుల సంక్షేమం కోసం దేశ ప్రదాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రత్యేక చట్టంచేసిన ఘనత బీజేపి దేనని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు సి ఎస్ ఆర్ నిదులు కేటాయించి దివ్యాంగుల కోసం పాఠశాలలు ఏర్పాటు చేయాలని, మోటారు సైకిల్లు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు బొండా.అచ్చిబాబు,సీనియర్ బీజేపి నాయకులు మరియు దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు జిలకర్ర.రమణ, 72వ వార్డు కార్పొరేటర్ అభ్యర్ధి సిరసపల్లి నూకరాజు ,మహిళా మోర్చా నాయకురాలు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలు చేశారనీ రుజువు చేస్తే రాజీనామాలు కు సిద్ధం



భీమునిపట్నం : విశాఖ జీవిఎంసి భీమిలి జోన్, కాపులు ప్పాడ లో వైకాపా పార్టీ నాయకులు భూములు ఆక్ర మణలు చేసారనీ బిజెపి నాయకులు నిరూపిస్తే రాజీ నామాల కు సిద్ధమనీ వైకాపా మండల నాయకుడు దౌలపిల్లి కొండ బాబు అన్నారు. చేపలు ప్పాడ సమీపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకులు నాగోతి సింగన్న పక్కా జిరాయితీ భూమి 4ఎకరాల 5సెంట్లు కొనుగోలు చేసుకున్నారనీ అయితే ఆ భూమి ఆక్రమణలు చేసారనీ బిజెపి నాయకులు అనడమే కాకుండా దానివెనుక మంత్రి హస్తం ఉందనీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. ఇది ఆక్రమణ చేసిన భూమి అని నిరూపిస్తే రాజీనామాలు కు సిద్ధం లేనిపక్షంలో బిజెపి నాయకులు క్షమాపణలు చెప్పాలని తెలిపారు.మంత్రి అవంతి శ్రీనివాసరావు నిజాయితీ పరుడనీ, ఆయన ఇలాంటి ఆక్రమణలు చేయరనీ అన్నారు. వైకాపా నాయకులు నాగోతి సింగన్న మాట్లాడుతూ స్థలంలో వరిపంటకు మందు కొడుతుండగా బిజెపి నాయకులు వచ్చి లేనిపోని ఆరోపణలు చేయడం బాధాకరమని చెప్పారు. ఈ ఆరోపణలపై స్పందించిన రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి సింగన్న 20గజాలు వదిలినట్లు చెప్పారనీ అన్నారు. నాపై లేనిపోని ఆరోపణలు చేసిన బిజెపి నాయకులు పై పరువు నష్టం దావా వేస్తాననీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్నాద అప్పారావు, మెరుగు చిన్నారావు,పాలబుచ్చి,బోర శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీసీ ప్రసాద రెడ్డికి అభినందనల వెల్లువ

## అభినందించిన ప్రముఖులు





ఏయూ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని నగరానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు. గురువారం ఉదయం పాలక మండలి సభ్యులు డాక్టర్ యేసుపాదం, చార్టెడ్ అకౌంటెంట్ జి.వి, విశాలక్షి నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్.నాగేశ్వర రెడ్డి, ఐ.డి గాంధీ, కార్యదర్శి వి.శేషగిరి రావు, జి.వి.శాస్త్రి, యు.స్వాతిదాసు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్, డిగ్రీ కళాశాల హాస్టల్ సు వెంటనే తెరవాలి- ఎస్ఎఫ్ఐ




పాడేరు : ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్స్ సదుపాయాలు వెంటనే తెరిపించాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. రాజశేఖర్ మీడియా సమావేశంలో ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెలలో రీ ఓపెనింగ్ అవ్వాల్సిన ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు కరోనా వల్ల నవంబర్ నెలలో ఓపెన్ చేయడం జరిగిందని అన్నారు. అయితే హాస్టల్ ఓపెన్ చేయక పోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నరన్నారు. విద్యార్థులు సుదూర ప్రాంతాల వాళ్ళు ఊర్ల నుంచి వచ్చి చదువుకోవాలంటే చాలా కష్టంగా ఉంటుందన్నారు. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యాలు కూడా లేవన్నారు. ఇటువంటి తరుణంలో విద్యార్థులు ఎలా చదువుకో గలరని దీనికి ప్రభుత్వమే సమాదానం చెప్పాలని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటాలాడుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికైనా విద్యార్థులు పూర్తి స్థాయిలో చదువుకునేలా సౌకర్యం కల్పించాలని విద్యార్థులకు హాస్టల్స్ కు రప్పించి కరోనా పరీక్షలు అక్కడే జరిపించాలని, వెంటనే హాస్టల్స్ తెరిపించి విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించాలని ఆయన ఐటీడీఏ అధికారులకు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు వరహాలు బాబు, మండల కమిటీ నాయకులు లోకేష్ ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# వైజాగ్ స్టీల్ బ్యాగ్స్ టాప్ అవార్డులు



. బి ఎఫ్ నుండి బృందం వారి క్యూ సి ని వర్చువల్ మోడ్‌లో ప్రదర్శిస్తుంది.

గాజువాక: "బంగ్లాదేశ్ సొసైటీ ఫర్ టోటల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (బిఎస్‌టిక్యూఎం)" ఆధ్వర్యంలో ఈనెల1 వ తేదీ నుండి 3 వ తేదీ వరకు బంగ్లాదేశ్‌లోని ఢాకాలో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ (ఐసిక్యూసిసి -2020) జరిగింది. చైనాతో సహా వివిధ దేశాల నుండి 250 కి పైగా జట్లు పాల్గొన్నాయి. ఫిలిప్పీన్స్, సింగపూర్, ఇండోనేషియా, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ తో పాటు శ్రీలంక తదితరదేశాలు ఈ పోటీలో పాల్గొన్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వైజాగ్ స్టీల్ నుండి మూడు ఎల్ క్యూ సి జట్లు, బ్లాస్ట్ ఫర్నేస్ నుండి "ఏ ఏం పి ఎస్", సి ఓ, సి సి పి నుంచి "యాన్త్రిక్" ఎల్ ఎం ఎం ఎం నుండి "న్యూ వింగ్స్" లు నిర్వహించిన పోటీలో వర్చువల్ మోడ్‌లో తమ కేస్ స్టడీస్‌ను ప్రదర్శించాయి. అన్ని జట్లు కన్వెన్షన్‌లో అత్యున్నత పురస్కారమైన "ప్లాటినం" ను పొందాయి, బ్లాస్ట్ ఫర్నేస్ నుండి వచ్చిన "ఏ ఎం పి ఎస్ బృందం అంతర్జాతీయంగా 'ప్లాటినం' అవార్డు దక్కించుకున్నట్లు ఆర్ ఐ ఎన్ ఎల్ యాజమాన్యం తెలిపింది. ఈ ఈవెంట్ లో కె.చంద్రశేఖర్, ఎం.వి.రమణ మూర్తి, అహ్మద్ వల్లి, పిఎం సత్యనారాయణ, ఎం. అప్పలరాజులతో కూడిన బ్లాస్ట్ ఫర్నేస్ యొక్క క్యూసి బృందం "ఎఎమ్‌పిఎస్" "ముడ్‌గన్ స్లీవ్ మెకానిజంలో స్ట్రైకర్ కామ్ స్విచ్‌తో ఎన్‌కోడర్‌ను మార్చడం" పై తమ కేస్ స్టడీని సమర్పించారు. డబ్ల్యు. మురళి కృష్ణరావు, వి ఘన్శ్యామ్ ప్రసాద్, జి పద్మ కుమార్, డి రామారావు, బి భాస్కరరావులతో కూడిన సియు అండ్ సిసిపికి చెందిన క్యూసి బృందం "పుషర్ కార్ -1 లో విండో లిఫ్టింగ్ మెకానిజం మార్పు" పై తమ కేస్ స్టడీని సమర్పించింది.

పి వెంకన్న రావు, డి రామ కృష్ణ, బి కుశాల్ కృష్ణ, టి గోవింద రావు మరియు కె సత్యనారాయణలతో కూడిన ఎల్ఎంఎమ్ఎమ్ యొక్క క్యూసి బృందం "ఉత్పత్తి ఆలస్యం,రేక్ నిలుపుదల సమయం పై కేస్ స్టడీ ని సమర్పించారు. గురువారం సంస్థ లో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాలను తీసుకువచ్చిన విజేతలను సిఎండి పి.కె.రాత్ అభినందించారు. ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్ కె సక్సేనా విజేతలను అభి నందిస్తు, షాప్ ఫ్లోర్‌లోని సమస్యలను పరిష్కరించడానికి అదే విధానంతో కృషి చేయాలని వారిని కోరారు.


మొదటి బహుమతి విజేతలు, బి ఎఫ్ నుండి ఏ ఎం పి ఎస్ జట్టు.

# గొల్లపాలెం లో పూరిళ్లు దగ్ధం



భీమునిపట్నం: జీవిఎంసి భీమిలి జోన్ మూడవ వార్డ్ గొల్లల పాలెం లో గాలి రాజు, ధనలక్ష్మి, దంపతుల పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది.

సుమారు 5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆర్ ఐ.రామకృష్ణ తెలిపారు.

విఆర్ఓ సాగర్, వైసిపీ నాయుకులు మైలపల్లి షణ్ముఖ రావు, కోండ్రు రామ సూర ప్పుడు, పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, సంఘటన స్థలానికి చేరు కుని బాధిత కుటుంబా లకు ప్రభుత్వం తర పున అన్ని సహాయ సహ కారం అందిస్తామని తెలియజేశారు.



**విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 29వ వార్డ్ లో వార్డ్ వైస్సార్సీపీ కార్పొరేటర్ అభ్యర్ధి ఉరికిటి నారాయణరావు ఈరోజు ఊటగెడ్డ ప్రాంతం లో పర్యటించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కండిపిల్లి సతీష్ ,చొల్లంగి శేఖర్, బోండాడ వెంకటరావు ,బులెట్ రవి, నడిపురి రాజు, ఒమ్మి సురేష్, పల్లా అప్పలరాజు, శీలా అప్పన్న, గౌతమ్, చిన్న, గోలగాని సతీష్, ఉమా మహేష్, సాయి ప్రభ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.**

# వెల్లంకి గ్రామంలో రహదారుల సమస్య పరిష్కరించాలి




ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి ఏత పేట వద్ద చాలా కాలంగా తలెత్తుతున్న రహదారుల సమస్యను తక్షణమే పరిష్కరించాలి వెల్లంకి గ్రామ పెద్దలు కోరారు, చాల కాలంగా రహదారుల వెడల్పు పెంచి కాలువలు నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవ్వరు స్పదించడంలేదని తెలిపారు, ఈ రహదారిలో అనేక గ్రామాల ప్రజలు ప్రయాణం చేసిన రోడ్డు కావున అధికారులు తక్షణమే రిపేర్ చేసి సమస్యను పరిష్కరించి ఏతా పేట కుటుంబాలకు మరియు గ్రామస్తులు పడుతున్న సమస్యను పరిష్కరించాలని కోరారు.

# గాయపడిన యువకుడిని పరామర్శించిన

# 2వ వార్డు బీజేపీ జనసేన అభ్యర్థి

భీమునిపట్నం : గత నెల 29న భీమిలి రోడ్ చిల్లపేట చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన రవ్వ గగన్( 25) ను 2వ వార్డు బిజెపి-జనసేన కార్పొరేట్ అభ్యర్థి గనివాడ పార్వతి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ

ఆ అబ్బాయి కుటుంబ సభ్యులతో మాట్లాడి భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ కు తెలియజేయగా ఆయన వెంటనే స్పందించి క్యూ1హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి వెంటనే అబ్బాయికి సరైన శస్త్రచికిత్స చేయాలని మరియు వైద్య ఖర్చుల తగ్గించాలని చెప్పగా సరే అని హాస్పిటల్ యాజమాన్యం హామీ ఇచ్చారనీ అన్నారు .అదేవిధంగ దివ్యాంగుల నిరసన దీక్షలో ఉన్న నేను, అనుకోని విధంగా జనసేన జిల్లా నాయకులు బొడ్డేపల్లి రఘు ని కలిసి ఈ విషయాన్ని తెలియజేయగా ఆయన కూడా వెంటనే స్వయంగా మాతో పాటు హాస్పిటల్ కి వచ్చి అబ్బాయికి ధైర్యం చెప్తూ రూ.50,000 అందజేస్తా ను అని చెప్పారనీ తెలిపారు.

వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, జనసేన అధ్యక్షులు రఘు కి ధన్యవాదాలు తెలియజేశారు.

# వాహనాల తనిఖీలు




గొలుగొండ : మావోయిస్టు వారోత్సవాలు భాగంగా గొలుగొండ పోలీసు సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి వచ్చే పోయే వాహనాల పై ఆరా తీశారు. గొలుగొండ గ్రామంలో ఏఎస్సై దేవుడు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. గతంలో వాహనాలు, బైక్‌లు వివిధ కేసుల్లో పెండింగ్ ఉన్న చలానాలు వాహనదారులు చెల్లించే విధంగా సిబ్బంది రామారావు, కొండబాబు, హెచ్‌సి ఆదేశాలు జారీ చేశారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో డాగ్ స్క్వాడ్ పాత్ర కీలకం





విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే డాగ్ స్క్వాడ్ ఆర్మూడు రిజర్వ్ డి.ఎస్.పి ఆర్.పి.ఎల్. శాంతి కుమార్ నేతృత్వంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ బి.రామకృష్ణరావు పర్యవేక్షణలో....

విశాఖపట్నం, కైలాసగిరి ఆర్మూడు రిజర్వ్ కార్యాలయంలో 10 జాగిలాలు వివిప బందోబస్తు విధులలో, నేరస్తులను పట్టుకొనుటకు, మందు పాత్రలను గుర్తించేందుకు మరియు మాదకద్రవ్యాలను గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ పొందుతున్నాయి. వీటిలో 6 జాగిలాలు పేలుడు పదార్ధాలను గుర్తించేవి, 2 జాగిలాలు ట్రాకర్,2 జాగిలాలు మాదకద్రవ్యాలను గుర్తించేవి ఉన్నాయి. వీటిని విజయవాడకు చెందిన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ సభ్యులు ఈరోజు పరిశీలించారు. జాగిలాల పనితీరు, ఆరోగ్యం,చురుకుదనం, స్పందన అంశాలను క్షుణ్ణంగా గమనించారు. గోల్డ్, రూబీ, క్యాండీ, రూనీ, సిరి, రైడర్, జిక్కీ, రాఖి, రాబిన్ మరియు వోల్గా జాగిలాల బరువు, శరీర ఉష్ణోగ్రత పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

డాగ్ పేరు, ప్రత్యేకత, బ్రీడ్, పుట్టిన తేదీ తదితర వివరాలతో ప్రత్యేక ఫైల్ నిర్వహించాలని ట్రైనర్ లకు సూచించారు.

మందుపాతరలను గుర్తింపు,చోరీల క్లూస్ మరియు మాదకద్రవ్యాలను కనిపెట్టడంలో నిరంతరం శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ టి.ఎన్. శ్రీనివాసరావు, వెటర్నరీ డాక్టర్ ఎస్.ప్రతాప్, ఇన్స్పెక్టర్ జి.ఆర్.సి.రెడ్డి పాల్గొన్నారు.

## 5న ట్రిపుల్ ఐటి ప్రవేశ పరీక్ష

### జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ

శ్రీకాకుళం : ట్రిపుల్ ఐటిల్లో ప్రవేశాల కొరకు ఈ నెల 5వ తేదీన పరీక్ష జరగ నుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 5న ఉదయం 11.00 గం.ల నుండి మధ్యాహ్నం 01.00గం. వరకు పరీక్ష జరగనుందని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని 38 మండలాల్లోని 60 కేంద్రాలలో ఈ పరీక్షలు జరగనున్నాయని, ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 6,785 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆమె చెప్పారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. కోవిడ్ దృష్ట్యా పరీక్షకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా మాస్కును ధరించాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా సమయానికి రెండు గంటలు ముందుగా సంబంధిత కేంద్రాలకు హాజరు కావాలని ఆమె సూచించారు. విద్యార్థులు నవంబర్ 28 తేదీన తీసుకున్న హాల్ టిక్కెట్లతోనే పరీక్షా కేంద్రాలకు హాజరుకావచ్చునని ఆమె స్పష్టం చేశారు.

## ట్రాక్టర్ యజమానికి పబ్లిక్ హెల్త్ విభాగం జరిమాన



ములగాడ: జీవీఎంసీ 62వ (పాత49వ వార్డ్) వార్డు దుర్గానగర్ కు చెందిన సన్యాసినాయుడు అనే ట్రాక్టర్ యజమానికి జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం సిబ్బంది గురువారం జరిమానా విధించారు. సన్యాసినాయుడు తన ట్రాక్టర్ కు క్రొత్త టైర్లను కొద్ది నెలల క్రితం మార్చాడు. అలా మార్చిన తరువాత పాత టైర్లను ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వద్ద పెట్టి టైర్లకు, స్తంభానికి తాళం వేసాడు. వర్షాభావం కావడం వలన ఆ పాత టైర్లలలో వర్షపు నీరు చేరి డెంగ్యూ, మలేరియా కారక దోమలు వృద్ధి చెందాయి. ఇది గమనించిన వార్డు మలేరియా సూపర్ వైజర్ తన సిబ్బందితో ఆ టైర్లలో ఉన్న లార్వాను తొలగించి ఆ ట్రాక్టర్ యజమానికి టైర్లు అక్కడ నుండి తీసివేయాలని చెప్పారు. దానికి ఆ యజమాని సరేనని చెప్పాడు. ఇది జరిగి సుమారు నెల రోజులు గడిచినా ఆ యజమాని టైర్లను అక్కడ నుండి తొలగించక పోవడంతో గురువారం సమీప సచివాలయ శానిటరీ సెక్రటరీలు, వార్డు శానిటరీ సూపర్ వైజర్లు ఆ ట్రాక్టర్ యజమానికి జరిమాన విధించి టైర్లను అక్కడ నుండి తొలగింపజేసారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు వెంకునాయుడు, జి శ్రీనివాసరావు, మేస్త్రీ రమణ, సూపర్ వైజర్ గంట్యాడ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 'రేపటి పౌరులు' పై అవగాహనా కార్యక్రమం



విశాఖపట్నం సిటీ : నగర పోలీస్ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా, ప్రారంభించిన "రేపటి పౌరులు" కార్యక్రమంలో భాగముగా 2020 నాడు నగర వ్యాప్తముగా వివిధ నివాస ప్రాంతాలలో, కళాశాలల్లో, సందర్శనా ప్రాంతాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది,

అలాగే బాలికలకు, విద్యార్థినిలకు, మహిళలకు దిశా ఆప్ ఆవశ్యకత ను తెలియజేస్తూ...

దిశా ఎస్.ఓ.ఎస్ ఆప్లి ను వారి మొబైల్ నందు ఇన్ స్టాల్ చేయించడం జరుగుతున్నది.

## స్వచ్ఛ సర్వేక్షణ్ - 2021 అవగాహనపై ర్యాలీ నిర్వహణ



విశాఖపట్నం :- జివిఎంసి మూడవ జోన్ పరిధిలోని 19వ వార్డు నెహ్రూ నగర్ లో స్వచ్ఛ సర్వేక్షణ్ -2021పై కాలనీ సంక్షేమ సంఘం వారితో కలసి అవగాహన ర్యాలీ ప్రారంబించిన జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసరు కె.ఎస్.ఎల్.జి. శాస్త్రీ. గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ ప్రారంభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్- 2021లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు గాను శానిటరీ ఇన్ స్పెక్టరు, వార్డు శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది కృషి చేయాలని, ప్రతి నిత్యం వార్డులో గెడ్డలు, కాలువలు, రోడ్లను శుభ్రంగా ఉంచాలని, ప్రతీ రోజూ చెత్త తరలించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ -2021పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్ స్పెక్టర్లును ఆదేశించారు. నెహ్రూ నగర్ కాలనీలో ప్రజలు కాలువల్లో చెత్తను వేయకుండా సహకరించాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మీకునికి అందించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ - 2021లో నగరానికి ఉన్నత స్థానం సాధించేందుకు సంక్షేమ సంఘం వారు తోడ్పాటు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మూడవ జోనల్ కమిషనర్ ఫనిరాం, కార్యనిర్వాహక ఇంజినీరు(మెకానికల్) చిరంజీవి, వార్డు ప్రత్యేక అధికారిణి నాగమణి, శానిటరీ ఇన్ స్పెక్టరు శ్రీనివాసరావు, వార్డు శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల్లో మనోధైర్యం పెంచాలి



అచ్యుతాపురం : దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరు ప్రేమ , అప్యాయత చూపిస్తూ వారిలో మనోధైర్యం పెంచాలని ఎంఈఒ సి ఆర్ కె దేవరాయల్ అన్నారు . స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం దివ్యాంగులకు క్రీడా పోటిలు నిర్వహించి బహుమతులను ఆయన చేతులు మీదుగా అందజేశారు . ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివానందం , ఐఈఆర్ టి జగదాంబ , ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు .

## పారిపోవడం అనేది దివంగత వైఎస్సార్, జగన్మోహనరెడ్డిల రక్తంలోనే లేదు

- రాష్ట్రంలో ప్రతి నెలా రూ.1500కోట్ల పెన్షన్లు ఇస్తున్నాం
- నాడు కాంగ్రెస్ పార్టీ నుండి హైదరాబాద్ అద్దాల మేడ వరకు
- పారిపోవడానికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబుదే
- చంద్రబాబే ఫేక్ ప్రతిపక్ష నేత, ఆయనది ఫేక్ పార్టీ
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని



అమరావతి : పారిపోవడం అనేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన కుమారుడు జగన్మోహనరెడ్డిల రక్తంలోనే లేదని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. చంద్రబాబు చేసే కార్యక్రమాలను పెద్దవిగా, ప్రభుత్వం చేసే వాటిని తక్కువ చేసి చూపించడం అలవాటుగా మారిపోయిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ళలో మొదటి నాలుగు నెలలు రూ.200లు, తర్వాత 54నెలల పాటు రూ.వెయ్యి చొప్పున, చివరి రెండు నెలలు రూ.2వేలు చొప్పున పెన్షన్లను ఇచ్చారన్నారు. ఎన్నికలు ఇంకా నాలుగు నెలలు ఉండగా 2019 జనవరి 1వ తేదీన జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 5లక్షల మందికి కొత్తగా పెన్షన్లను మంజూరు చేశారన్నారు. నాలుగున్నరేళ్ళ కాలంలో దాదాపు 5లక్షల పెన్షన్లను చంద్రబాబు తొలగించారన్నారు.చంద్రబాబు హయాంలో 60నెలల కాలంలో రూ.30వేల కోట్ల పెన్షన్లు పంపిణీ చేశారన్నారు. సీఎం జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పెన్షన్లను రూ.2,250లకు పెంచారన్నారు. త్వరలో మరో రూ.250ల పెన్షన్ పెరగనుందన్నారు. కొత్తగా ఆరేడు లక్షల పెన్షన్లను మంజూరు చేశామని తెలిపారు. పెన్షన్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తర్వాతి నెల 1వ తేదీ నుండి పెన్షన్లను ఇస్తున్నామన్నారు. జగన్మోహనరెడ్డి ఐదేళ్ళ పాలనలో దాదాపు రూ.లక్ష కోట్ల మేర పెన్షన్లకు ఖర్చు చేయనున్నారన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2004లో ఉమ్మడి రాష్ట్రంలో 74లక్షల మందికి పెన్షన్లు ఇచ్చారన్నారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లేనివారిని దృష్టిలో పెట్టుకుని డాక్టర్ సర్టిఫికెట్ ద్వారా పెన్షన్లను మంజూరు చేసిన మహానుభావుడు రాజశేఖరరెడ్డి అని అన్నారు. అంతకు ముందు చంద్రబాబు హయాంలో కేవలం 17లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం 17లక్షలకు మించి ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదన్నారు. అప్పట్లో పెన్షన్‌దారుడు చనిపోతేనే కొత్తగా పెన్షన్లు ఇచ్చేవారన్నారు. చంద్రబాబు, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు మంచిని మంచిగా ఒప్పుకోవాలన్నారు. చేసిన తప్పులను సరిదిద్దుకుని ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సూచనలివ్వాలన్నారు. అలా కాకుండా చేసేవాళ్ళపై బురద జల్లడం, రాళ్ళు విసరడం వంటివి చేయవద్దన్నారు. 65 నుండి 60 సంవత్సరాలకు, 750చదరపు అడుగుల లోపు ఉండాల్సిన ఇంటిని వెయ్యి గజాల లోపునకు, మూడెకరాల మాగాణిని ఐదెకరాలకు, ఐదెకరాల లోపు ఉండాల్సిన మెట్టను పదెకరాలకు, విద్యుత్ వాడకాన్ని వంద యూనిట్ల నుండి 200 యూనిట్‌లకు పెంచుతూ ఎక్కువ మంది లబ్ధిదారులకు పెన్షన్ ఇవ్వాలని సీఎం జగన్మోహనరెడ్డి నిబంధనలను సరళతరం చేస్తూ వచ్చారన్నారు. చంద్రబాబు హయాంలో నెలకు రూ.490కోట్లు ఇచ్చేవారని, సీఎం జగన్మోహనరెడ్డి పాలనలో నెలకు రూ.1500కోట్లు ఇస్తున్నామన్నారు. చట్టసభలను ఉపయోగించుకుని ప్రభుత్వంపై ఏదో విధంగా నిందలను వేస్తున్నారని, ఈసారి చంద్రబాబు సీట్లు ఇచ్చినా ఎవరూ గెలవరన్నారు. పారిపోవడానికి కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబును చెప్పవచ్చన్నారు. 1983లో చంద్రబాబు ఓడిపోగానే కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలోకి పారిపోయాడన్నారు. ఆ తర్వాత చంద్రగిరి నుండి కుప్పం పారిపోయాడని, ఓటుకు నోటు కేసులో హైదరాబాద్ నుండి కరకట్టకు పారిపోయి వచ్చాడని, కరోనా రాగానే అక్కడి నుండి హైదరాబాద్‌లోని అద్దాల మేడకు షిఫ్ట్ అయ్యాడన్నారు. ఆ మధ్య ఢిల్లీ అంటూ వచ్చిన చంద్రబాబు ఇప్పుడు అక్కడకు వెళ్ళడం లేదని, నరేంద్ర మోదీ పేరు కూడా ఎత్తడం లేదన్నారు. గతంలో నల్ల దుస్తులు ధరించి గల్లీల్లో నరేంద్ర మోదీకి అర్థంకాని తెలుగుభాషలో ఆయనను తిట్టాడన్నారు. చీకట్లో చిదంబరం కాళ్ళు పట్టుకున్నాడని, అలయన్స్ లేకుండా ఎన్నికల్లో పోటీ చేయడన్నారు. గెలిస్తే నా ప్రతిభ వల్లే గెల్చానని, నన్ను చూసే రాష్ట్ర ప్రజలు ఓటు వేశారని అలయన్స్ పెట్టుకున్న పార్టీలను ఈడ్చిపెట్టి తంతాడన్నారు. ఏలేరు స్కాం వంటి కేసుల్లో దాదాపు 18స్టేలు తెచ్చుకున్నాడన్నారు. అమరావతి భూ కుంభకోణం విషయంలో చంద్రబాబు తనకున్న వ్యవస్థలను ఉపయోగించుకుని ఏకంగా గ్యాగ్ ఆర్డర్‌ను తెప్పించుకున్నారన్నారు. చంద్రబాబు అందితే కాళ్ళు, లేకపోతే జుట్టు పట్టుకుంటాడని, వెన్నుపోటు కూడా పొడుస్తాడన్నారు. చంద్రబాబులా దిగజారుడు రాజకీయాలు చేసే వ్యక్తి, పారిపోయే వ్యక్తి ఎవరూ లేరన్నారు. ఇచ్చిన మాట కోసం, పేదప్రజల కష్టాలను తీర్చడం కోసం సీఎం జగన్మోహనరెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిపై మాట్లాడే ముందు ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి 3,648కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసి 67మంది శాసనసభ్యులతో ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికై, 151 సీట్లతో ముఖ్యమంత్రి అయిన జగన్మోహనరెడ్డి ఫేక్ ముఖ్యమంత్రి ఎలా అవుతారో చంద్రబాబు చెప్పాలన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు, పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన చంద్రబాబే ఫేక్ ముఖ్యమంత్రి, ఫేక్ ప్రతిపక్ష నాయకుడని, ఆయన పార్టీ ఫేక్ పార్టీ అని అన్నారు. అలాగే గాలి ముఖ్యమంత్రి, గాలి నాయకుడు కూడా చంద్రబాబేనని మంత్రి కొడాలి నాని మండిపడ్డారు.

## బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ వర్చ్యువల్ సమావేశంలో పాల్గొన్న కమిషనర్



విశాఖపట్నం :- బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ డా. ఆండ్రూ ఫ్లెమింగ్ తో జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన వర్చ్యువల్ సమావేశంలో గురువారం పాల్గొన్నారు. యు.కె. ప్రభుత్వం ఆధ్వర్యంలో భారత్ లో క్లైమేట్ రీసిల్లెంట్ సిటీస్ ఫర్ హేర్డ్ ప్రోస్పరిటీ(సి.ఆర్.ఇ.ఎస్.పి.) పథకం క్రింద భారత్ లో ఐదు నగరాలు లబ్ది పొందుతుండగా, అందులో విశాఖపట్నం నగరం స్థానం పొందింది. ఈ పథకం క్రింద కార్పోరేషన్ పరిధిలోని మధురవాడ ప్రాంతంలో నీటి సేకరణ మరియు భూగర్భ డ్రైనేజి అభివృద్ధి ప్రాజెక్టు చేపట్ట బోతుంది. ఈ ప్రాజెక్టుపై బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ డా. ఆండ్రూ ఫ్లెమింగ్ తో కమిషనర్ చర్చించారు. ఈ సమావేశంలో బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ డా. ఆండ్రూ ఫ్లెమింగ్, బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్, హైదరాబాద్, జివిఎంసి కమిషనర్ డా. జి, సృజనతో పాటు, జావిద్ మల్ల, సీనియర్ అడ్వైజర్, బ్రిటీష్ డిప్యూటీ హైకమిషన్ సుష్మా చౌదరి, పైలట్ ప్రోగ్రాం మేనేజర్, మాటో మెక్ డోనాల్డ్, కార్పోరేషన్ ప్రధాన ఇంజనీరు ఎం. వెంకటేశ్వర రావు, పర్యవేక్షక ఇంజనీరు (ప్రాజక్టు) వినయ కుమార్, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్ తదితులు పాల్గొన్నారు.

## లోకేష్‌కు ఆ స్క్రిప్ట్‌ను ట్విటర్‌లో పెట్టడమే తెలుసు



అమరావతి: మహిళా సాధికారిత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మహిళా సంక్షేమంపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..'మహిళలు తిరుగులేని శక్తిగా ఎదిగే సాధికారత కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు. చంద్రబాబుది 420 విజన్. వైఎస్ జగన్ విజన్.. ఓ విప్లవం. వచ్చే జనరేషన్ గురించి ఆలోచించే ప్రజా నాయకుడు. ప్రతి ఆడ బిడ్డను రక్షించే 'దిశ' చట్టాన్ని తెచ్చారు.

ఎన్నో పథకాలు తీసుకొచ్చిన వైఎస్ జగన్.. ఓ క్రియేటర్. వైఎస్ జగన్ ఫేక్ సీఎం కాదు.. చంద్రబాబును షేక్ చేసిన ముఖ్యమంత్రి. ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. నారా లోకేష్‌కు ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ట్విటర్‌లో పెట్టడమే తెలుసు. సర్పంచ్‌గా కూడా గెలవలేని వ్యక్తి లోకేష్' అని ఎద్దేవా చేశారు.

## ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన కె.కె రాజు



అమరావతి : గురువారం అమరావతి అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు మర్యాదపూర్వకంగా కలిసారు. ఉత్తర నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

## వారికి జీతం ఎంత పెంచినా తక్కువే

### ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమవేశాల్లో భాగంగా గురువారం ఉద్యోగుల సంక్షేమం-ప్రభుత్వ విధానంపై శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఏపీఎస్ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయ మన్నారు. 51,500 మంది ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయడం వల్ల ఏడాదికి ప్రభుత్వంపై 3 వేల కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని ఔట్ సోర్సింగ్?, కాంట్రాక్ట్ ఉగ్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కావాలి

### -హనీ ట్రాప్ లో ఎంతటి వారున్నా వదిలి పెట్టం - 2022లో 'ప్రెసిడెంట్స్ మిలాన్' - భారతనేవీ ప్రధానాధికారి అతుల్ కుమార్ జైన్




గాజువాక : రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని భారతనేవీ ప్రధానాధికారి అతుల్ కుమార్ జైన్ పేర్కొన్నారు.ఐఎన్ఎస్ సర్కార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డుతూ అత్మనిర్భర భారత్ పథకం కింద ప్రధానంగా మేలు చేకూరేది త్రివిధ దళాలలకేనని స్పష్టం చేశారు. పబ్లిక్, ప్రైవేట్, ఎమ్. ఎస్.ఎమ్. విభాగాలు రక్షణ రంగ అవసరాలకు కూడా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. స్వదేశీ పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కునేందుకు ఇదే సరైన తరుణ మన్నారు. ఐదు ట్రిలియన్ ఎకానమీ సాధనలో సముద్ర రవాణా కూడా కీలకమని,అందుకు తగ్గట్టు రక్షణ పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనకున్న సవాళ్లకు ధీటుగా ఎయిర్ క్రాఫ్ట్ కేరియర్లు, లాంగ్ రేంజ్ షిప్ లు న్యూక్లియర్ సబ్ మెరైన్లను సమకూర్చుకోవాలన్నారు. మేరీ టైం డొమైన్ ఎవేర్ నెస్ పై ప్రధానంగా తాము దృష్టి పెట్టామని, నిర్మాణంలో ఉన్న విక్రాంత్ ఎయిర్ క్రాఫ్ట్ కెరియర్ కోవిడ్ కారణంగా ఆలస్యమవుతోందని తెలిపారు. 2021లో విక్రాంత్ కు ట్రయిల్ రన్ పూర్తయ్యే అవకాశాలు న్నాయన్నారు. అంతేకాకుండా 2022 నాటికి పూర్తిస్థాయిలో అది తూర్పు నావికదాళంలోకి వస్తుందన్నారు. విశాఖ సముద్ర జలాల్లో 2022లో జరగనున్న ప్రెసిడెంట్స్ మిలాన్ కు రాష్ట్రపతి పాల్గొంటారని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర పతి భవనం నుంచి ఖరారు కాగానే షెడ్యూల్ ప్రకటిస్తామని తెలిపారు. హనీ ట్రాప్ లో ఉన్నవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని అన్నారు. పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియా డమ్మీ ఫేస్బుక్ అకౌంట్లు తోనే పాకిస్థాన్ హనీ ట్రాప్ కి పాల్పడుతొందన్నారు. ఆన్ బోర్డ్ షిప్ లలో మొబైల్స్ నిషేధించామని తెలిపారు. ఇందులో నేవీ అధికారులు పాత్ర ఉన్నదని వాదనను ఆయన కొట్టిపారేశారు.

ఈ ఏడాది నిర్వహించవలసిన నేవీ డే కార్యక్రమాలను కవిడ్19 కారణంగా పూర్తిగా రద్దు చేస్తున్నామని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో నేవీ అధికారులు రథం సంజయ్, శ్రీ కుమార్, వెంకటరామాన్ తదితరులు హాజరయ్యారు.




## భారీగా పెరగనున్న మున్సిపల్ పన్ను

## ప్రజల నడ్డి విరిచేలా కొత్త విధానం

**- జీఓ 190ను వ్యతికిస్తున్నాము ఈ జీవోపై ప్రభుత్వం పునరాలోచించాలి**

**- విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు**



అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న కొత్త మునిసిపల్ స్థానిక పన్నుల విధానం ప్రజల మీద భారం మోపుతోంది, జీ ఓ 190 ను వ్యతిరేకిస్తూ గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే గణబాబు పురాలోచించాలని డిమాండ్ చేసారు. నగరాలూ, మున్సిపాలిటీస్, కార్పొరేషన్లో ప్రజలందరిపై ఆర్థిక భారాన్ని మోపుతూ ఇల్లు ,షాపులు ,నీరుకు కట్టే పన్ను అమాంతంగా ఒకేసారి పెంచుకునేలా జీ ఓ ను రూపొందించి, ఆర్థికంగా ఇప్పటికే దెబ్బతిన్న వ్యాపారులను, నిర్మాణరంగాన్ని ఇంకా కుదేలు చేసే విధంగా ఉన్నాయి.

మునిసిపల్ మంత్రి కొత్తగా పెంచిన పన్ను విధానంలో 350ఎస్.ఎఫ్.టీ పైన నివాసాలకు సంపన్నులవలె పన్ను మోపడం ప్రస్నార్ధకం . 300-350 పైన ఇల్లు కలవారు సంపన్నులైతే , దేశమంతా 405 ఎస్.ఎఫ్.టీ నివాసాలకు కూడా పేదవారని చెప్పి ప్రభుత్వం నిధులెట్ల ఇస్తుంది . ఒక అవగాహనలేని చట్టం తీసుకువచ్చి ప్రజల కష్టాలు ,పడిపోయిన ఆదాయాలు చూడకుండా కేవలం పన్ను భారం ఒక్కటే లక్ష్యంగా తీసుకువచ్చిన కొత్త జీవో గురించి పునరాలోచించాలి .

ఇది వరకు అద్దె విలువ మీద పన్నులు కట్టేవాళ్ళం. ఇప్పుడు జీ ఓ. 190 ప్రకారం అస్తి విలువ మీద పన్ను వేస్తారు, దాని వలన ఒకేసారి భారీగా పన్నులు పెరుగనున్నాయి.

ఒకే జిల్లాలో కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వాలు ఒక మంత్రిత్వ శాఖ పేదవారని చెప్పి ఆదుకుంటే , మరో మంత్రిత్వ శాఖ వారి పై పన్నులు వేయడం దేనికి సంకేతం , ఒక చేతితో డబ్బులు పెట్టి మరో చేతితో లాగుకోవడం మానుకోవాలి. ప్రజలపై పన్నులు బదులు,అనవసర అప్పులు ఆపి వేరు ఆదాయ మార్గాలు మున్సిపాలిటీస్ పెంచుకోవాలి.




*ప్రియతమ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని గ్రేటర్ పరిధిలోని అన్ని వార్డుల్లో కలిసి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ప్రగతి భారత్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వైయస్సార్ క్రికెట్ టోర్నమెంట్ కప్ ను గ్రేటర్ విశాఖ 24 వ వార్డు లో మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ కప్ బ్రోచర్ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వార్డు వైకాపా శ్రేణులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.*

## అది గ్రహశకలం కాదు..

## 54 ఏళ్ల క్రితం నాటి రాకెట్ శిథిలం



హైదరాబాద్ : భూ కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఓ రహస్య వస్తువుపై ఖగోళ శాస్త్రవేత్తలు క్లారిటీ ఇచ్చారు. భూగోళం చుట్టూ తిరుగుతున్న ఆ వస్తువు గ్రహశకలం కాదు అని, అది 54 ఏళ్ల క్రితం ప్రయోగించిన అట్లాస్ సెంటార్ రాకెట్‌కు చెందిన శిథిలమని ఖగోళ శాస్త్రవేత్తలు తేల్చారు. హవాయిలో ఉన్న టెలిస్కోప్ ద్వారా ఆ రాకెట్ శిథిలాన్ని గుర్తించినట్లు కాలిఫోర్నియాలో ఉన్న నాసా జెట్ ప్రొపల్షన్ ల్యాబ్ పరిశోధకులు తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఆ వస్తువును గుర్తించిన శాస్త్రవేత్తలు.. తొలుత అది గ్రహశకలం అనుకున్నారు. కానీ ఆస్టరాయిడ్ నిపుణుడు పాల్ చూడాస్ దీనిపై క్లారిటీ ఇచ్చారు. భూ కక్ష్యలో తిరుగుతున్న ఆ వస్తువు.. 1966లో చంద్రుడిపైకి ప్రయోగించిన సెంటార్ రాకెట్‌కు చెందిన భాగమని గుర్తించారు. అయితే ఆ రాకెట్ శిథిలం సైజు పది మీటర్ల పొడువు, మూడు మీటర్ల వెడల్పు ఉంటుందని అంచనా వేస్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనాలో పనిచేస్తున్న శాస్త్రవేత్త విష్ణు రెడ్డి కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. గ్రహశకలంగా భావిస్తున్న ఆ వస్తువు ప్రస్తుతం 50 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నది. అయితే మార్చి నెలలో అది మళ్లీ సూర్యుడి కక్షలోకి వెళ్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మళ్లీ 2036లో ఆ రాకెట్ భాగం భూకక్ష్యలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు.

## ఐపీఎల్‌లోకి రెండు కొత్త టీమ్స్..

### డిసెంబర్ 24న బీసీసీఐ ప్రకటన!

ముంబై : వచ్చే ఏడాది ఐపీఎల్‌లోకి రెండు కొత్త టీమ్స్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు డిసెంబర్ 24న జరగబోయే వార్షిక సర్వసభ్య సమావేశంలో బీసీసీఐ దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ సమావేశం కోసం 23 పాయింట్లతో ఎజెండాను కూడా బోర్డు సిద్ధం చేసింది. 2020 ఐపీఎల్‌ను యూఏఈలో నిర్వహించడం ద్వారా వచ్చిన నష్టాన్ని ఈ కొత్త టీమ్స్‌తో రాబట్టుకోవాలన్నది బీసీసీఐ ఆలోచనగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ కొత్త టీమ్స్ కోసం పూర్తి స్థాయి వేలానికి సిద్ధంగా ఉండాలని అన్ని ఫ్రాంచైజీలకు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ సందేశం పంపించారు. వచ్చే ఏడాది మొదట్లోనే ఈ వేలం ఉండే అవకాశం ఉంది. అయితే ఐపీఎల్‌లోకి వచ్చే ఆ జట్లు ఏవి అన్నిదానిపై ఇప్పుడు ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇందులో ఒక టీమ్ కచ్చితంగా అహ్మదాబాద్ నుంచి ఉంటుందని ఇప్పటికే చాలా వార్తలు వస్తున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద స్టేడియంగా మారిన మొతెరానే ఈ టీమ్‌కు హోమ్ గ్రౌండ్‌గా ఉంటుందనీ ఆ వార్తలు తేల్చేశాయి.

## సాఫ్ట్‌స్కిల్స్ పాఠ్యాంశంగా

## బోధించాలి

### వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




ఆంధ్రాయూనివర్శిటీ : విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్‌ను పాఠ్యాంశంగా బోధించాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో రైటర్స్ అకాడమి నిర్వహించిన కార్యక్రమంలో 'కంప్లీట్ బుక్ ఆన్ సాఫ్ట్‌స్కిల్స్'ను ఆవిష్కరించారు. ఏయూ జర్నలిజం విభాగ విశ్రాంత ఆచార్యులు పి.బాబి వర్ధన్, ఏయూ సాఫ్ట్‌స్కిల్స్ శిక్షకుడు డాక్టర్ చల్లా క్రిష్ణవీర్ అభిషేక్‌లు సంయుక్తంగా రచించిన ఈ పుస్తకాన్ని వీసీ ప్రసాద రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక రచనా నైపుణ్యాలను, సామార్ధ్యాలను విద్యార్థు లకు అలవరచాల్సిన అవసరం ఉందన్నారు. విశ్రాంత ఆచార్యులు నేటి తరం యువతతో సంయుక్తంగా పుస్తక రచన చేయాలని సూచించారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు సాఫ్ట్‌స్కిల్స్‌గా నేడు చెబుతున్న విభిన్న జీవన నైపుణ్యాలను అందించేవన్నారు. నేటి తరం దీనిని ఒక పాఠ్యాంశంగా నేర్చుకోవలసిన అవసరం ఏర్పడుతోందన్నారు. దీనిని భర్తీ చేసే దిశగా ఈ పుస్తకం రావడం మంచి పరిణామ మన్నారు. దీనిని చిన్న భాగాలుగా తీర్చిదిద్ది, డిజిటల్ రూపంలో తీర్చిదిద్దాలన్నారు.

వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ మాట్లాడుతూ ఉపాధి కల్పనలో ఇవి ఎంతో కీలకంగా నిలుస్తాయన్నారు. విద్యార్థుల్లో బిడియం, భయం రూపుమాపి, వారిలో అవసరమైన సామర్ధ్యాలను పెంపొందిచడానికి సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ ఉపకరిస్తుందన్నారు.

పుస్తక రచయితలను అభినందించారు. పుస్తక రచయిత ఆచార్య పి.బాబి వర్ధన్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు పరిష్కారానికి, భావ నైపుణ్యాలు మెరుగు పరచడానికి, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఉపయుక్తంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దామన్నారు. రైటర్స్ అకాడమి అద్యక్షులు వి.వి రమణ మూర్తి మాట్లాడుతూ తమ సంస్థ నుంచి గతంలో పలు పుస్తకాలను ఆవిష్కరణ చేయడం జరిగిందన్నారు. చారిత్రక ఏయూ సెనేట్ మందిరంలో ఈ పుస్తకం ఆవిష్కరణ చేయడం మంచి పరిణామ మన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత చల్లా క్రిష్ణవీర్ అభిషేక్, పాలక మండలి సభ్యులు వర్మ తదితరులు పాల్గొన్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com